RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక
The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 | సంచిక: 33 | ఎడిటర్ : జేరిపోతుల సంపత్, కరీంనగర్ | శుక్రవారం 8-5-2026 | పేజీలు: 8 | వెల: రూ. 2.00

తెలంగాణ వాణి
విలేకరులు కావలెను
తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.
9182328292

# వివిఐపీ కల్చర్‌కు స్వస్తి

## - సాధారణ ట్రాఫిక్ లోనే సీఎం కాన్వాయ్



**హైదరాబాద్** ముఖ్యమంత్రి కాన్వాయ్ వస్తోందంటే చాలు గంటల ముందే రోడ్లు ఖాళీ చేయడం, కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌ను నిలిపివేయడం మనకు తెలిసిందే. కానీ, తెలంగాణలో ఇప్పుడు ఆ సీన్ మారింది. సామాన్య ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు ఉండకూడదన్న తన నిర్ణయానికి కట్టుబడి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సాధారణ ట్రాఫిక్‌లోనే ప్రయాణించారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి జూబ్లీహిల్స్‌లోని తన నివాసం వరకు ఇతర వాహనాలతో పాటే సీఎం కాన్వాయ్ సాగడం నగరవాసులను ఆశ్చర్యపరిచింది. తన రాక కోసం వాహనాలను నిలిపివేసి ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని బుధవారమే సీఎం రేవంత్ రెడ్డి డీజీపీకి, ఉన్నత స్థాయి పోలీస్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర పనుల మీద వెళ్లేవారు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు ముఖ్యమంత్రుల కాన్వాయ్ వల్ల గంటల తరబడి రోడ్లపై వేచి ఉండటం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలోనే గురువారం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి వస్తున్న సమయంలో సీఎం కాన్వాయ్ కోసం ట్రాఫిక్‌ను ఎక్కడా పూర్తిగా నిలిపివేయలేదు.

### సింగిల్ లేన్ విధానం..

### మారిన ట్రాఫిక్ రూల్స్

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు కొత్త విధానాన్ని అమలు చేశారు. కాన్వాయ్ వెళ్లే సమయంలో రోడ్డును పూర్తిగా బ్లాక్ చేయకుండా, కేవలం ఒక లేన్‌ను మాత్రమే కాన్వాయ్ కోసం కేటాయించారు. మిగిలిన లేన్లలో సాధారణ వాహనాల రాకపోకలను యథావిధిగా అనుమతించారు. దీనివల్ల సీఎం కాన్వాయ్ సాఫీగా సాగిపోవడంతో పాటు, ట్రాఫిక్ ఎక్కడా స్తంభించలేదు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయం పట్ల వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

2లో..

# పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం రద్దు

## - శాసనసభను రద్దు చేసిన గవర్నర్ ఆర్.ఎన్. రవి





**కోల్కతా** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం రాజీనామా చేయడానికి టీఎంసీ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిరాకరించిన నేపథ్యంలో ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి గురువారం కీలక నిర్ణయం తీసుకున్నారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని పశ్చిమ బెంగాల్ మంత్రివర్గాన్ని రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో బీజేపీ 200కు పైగా స్థానాల్లో విజయం సాధించి మెజార్టీ మార్కును అధిగమించింది. ఇక గత 3 పర్యాయాలుగా పశ్చిమ బెంగాల్‌లో అధికారంలో ఉన్న టీఎంసీ పార్టీ ఘోర పరాభవానికి గురైన సంగతి తెలిసిందే. అయితే కేంద్ర ఎన్నికల సంఘం, బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర ఆరోపణలు గుప్పించిన దీదీ తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని భీష్మించుకు కూర్చున్నారు.ఈ నేపథ్యంలోనే పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆర్ఎన్ రవి తాజాగా ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. 293 అసెంబ్లీ స్థానాలు ఉన్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో బీజేపీ 207 స్థానాలతో క్లియర్ మెజార్టీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు రెడీ అయింది. ఇక 2011 నుంచి అధికారంలో ఉన్న టీఎంసీ పార్టీ ఈ ఎన్నికల్లో 80 స్థానాలకు పరిమితమైంది. అయినప్పటికీ ఎన్నికల ప్రక్రియ సరిగ్గా జరగలేదని ఎస్ఐఆర్ ప్రక్రియలో ఏకంగా 90 లక్షలకు పైగా ఓట్లను తొలగించారని దీదీ ఆరోపించారు. ఈ క్రమంలోనే కేంద్ర ఎన్నికల సంఘంపైనా రిగ్గింగ్ జరిగిందంటూ మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు.ఎన్నికల ఫలితాల తర్వాత మాట్లాడిన మమతా బెనర్జీ సీఎం పదవికి తాను రాజీనామా చేసేది లేదని స్పష్టం చేశారు. తాను లోక్‌భవన్‌కు వెళ్లను అని గవర్నర్‌కు రాజీనామా పత్రం ఇవ్వనని తేల్చి చెప్పారు. ఈ క్రమంలోనే ఎన్నికల సంఘంపైనా, బీజేపీపైనా తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఈ ఎన్నికల్లో టీఎంసీ ఓడిపోలేదని విజయం సాధించిందని తెలిపారు. తమ ఓట్లను చోరీ చేశారని మండిపడ్డారు.మరోవైపు బెంగాల్‌లో భారీ విజయాన్ని అందుకున్న బీజేపీ ఈనెల 9వ తేదీన కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతోంది. రాజధాని కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు జరగనున్నట్లు పశ్చిమ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య అధికారికంగా

2లో..

## హైడ్రాను తెలంగాణ వ్యాప్తంగా

# విస్తరిస్తాం

### - సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణిని అన్న రంగనాథ్



**హైదరాబాద్** హైదరాబాద్ నగరంలో కబ్జాల నుంచి సుమారు రూ.85 వేల కోట్ల విలువైన భూములను కాపాడామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. ప్రస్తుతం హైడ్రా పరిధిలో రూ.10 లక్షల కోట్ల విలువ చేసే భూములు కబ్జాకు గురైనట్లు తమకు సమాచారం ఉందని ఆయన తెలిపారు. ఆయన గురువారం మిర్యాలగూడలో పర్యటించి, వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హైడ్రాను తెలంగాణవ్యాప్తంగా విస్తరిస్తామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. హైదరాబాద్‌లో హైడ్రా కార్యకలాపాలకు ప్రజలంతా ఆకర్షితులయ్యారని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా కావాలని ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తుతున్నాయని అన్నారు. కబ్జాలపై హైడ్రాకు వేలాదిగా ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన తెలిపారు. ఆయా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా తాము చర్యలు చేపడుతున్నామని అన్నారు. అందుకే నాలుగు వారాల పాటు ప్రజావాణిని నిలిపివేసినట్లు తెలిపారు. ఇప్పుడున్న దరఖాస్తుల పరిష్కారం కోసమే ప్రజావాణిని రద్దు చేశామని స్పష్టం చేశారు. హైడ్రాకు వ్యతిరేకంగా కొంతమంది కోర్టులను ఆశ్రయిస్తున్నట్లు చెప్పారు.

## మహిళా స్వయం సహాయక బృందాలకు

# వడ్డీలేని రుణాలు

### - రూ.10 లక్షల రుణానికి వడ్డీని ప్రభుత్వమే భరిస్తుందన్న సీతక్క




హైదరాబాద్ మహిళా సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మహిళా స్వయం సహాయక బృందాలకు ఇస్తున్న వడ్డీలేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. స్వయం సహాయక బృందాలు తీసుకునే రూ.10 లక్షల రుణానికి సంబంధించిన వడ్డీని ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. మహిళా స్వయం సహాయక బృందాలకు ఇచ్చే బ్యాంకు వార్షిక రుణ ప్రణాళికను ఈరోజు ప్రజాభవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక బృందాల సభ్యులకు రూ.25,228.89 కోట్ల బ్యాంకు రుణాలు ఇచ్చినట్లు సీతక్క తెలిపారు. మహిళా సంఘాల రుణాల వడ్డీ కోసం రూ.2,500 కోట్లు వ్యయం చేస్తామని వెల్లడించారు. 'మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి' అనే నినాదంతో ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. మహిళలు పేదరికం నుంచి బయటపడినప్పుడే అభివృద్ధి పరిపూర్ణమవుతుందని వ్యాఖ్యానించారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేసే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీతక్క తెలిపారు.

## కరీంనగర్‌లో

# రణరంగం

### - కరీంనగర్‌లో బీజేపీ శ్రేణుల విధ్వంసం
### - గంగుల క్యాంప్ ఆఫీస్‌పై దాడి
### - బండిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం



**హైదరాబాద్** తెలంగాణలో నేతల మాటలు శృతి మించుతున్నాయి. ఈ మాటల మంటలు కారణంగానే కరీంనగర్‌లో ఉద్రికత పరిస్థితులు నెలకొన్నాయి. బండి సంజయ్, కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి మధ్య మాటల తూటాలు, సవాళ్ల పర్వం సాగుతోంది. ఇది కాస్త దాడుల వరకు వెళ్లింది. బీఆర్ఎస్ నేతల మాటలకు ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ శ్రేణులు దాడులకు దెగబడ్డారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై దాడి చేశారు. ప్రెస్ మీట్ జరుగుతుండగానే బీజేపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు. కౌశిక్ రెడ్డి కారును ధ్వంసం చేశారు. రేవంత్, కేటీఆర్ కుమ్మక్కు అయ్యారని అందుకే కాళేశ్వరం సహా ఏ కేసులు కూడా ముందుకు కదలడం లేదని బండి సంజయ్ ఆరోపించారు. దీనిపై కేటీఆర్ కౌంటర్ ఇస్తూ ఎవరు ఎవరితో కుమ్మక్కు అయ్యారో తమకు తెలుసని అన్నారు. చాలా విషయాలు తమ వద్ద ఉన్నాయని సమయం వచ్చినప్పుడు అన్నింటినీ బయటపెడతామన్నారు. ఎవరికి ఎవరు సహాయ మంత్రిగా ఉన్నారో తేలుస్తామని అన్నారు. కచ్చితంగా ఒక్కో విషయం వెలుగులోకి వస్తుందని అన్నారు.

దీనిపై బండి సంజయ్ ప్రెస్‌మీట్ పెట్టి కేటీఆర్‌పై తీవ్ర పదజాలంతో దూషించారు. మనిషి పుట్టక అంటూ అసభ్యంగా మాట్లాడారు. కరీంనగర్‌లో పూర్తిగా కేటీఆర్‌ను తిరగనివ్వబోమని అన్నారు. తనపై చేసిన ఆరోపణలు రుజువులు చూపించాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ మత్తులో ఏదేదో మాట్లాడుతున్నారని దునుమాడారు. దీనికి బీఆర్ఎస్ కౌంటర్ ఇచ్చింది. డ్రగ్స్ వాడే అలవాటు బండి సంజయ్‌కు ఉందని అన్నారు. ఉన్నమాట అంటే ఉలుకు ఎందుకని ప్రశ్నించారు. తంబాకు, డ్రగ్స్ తినే అలవాటులో బండి సంజయ్ ఏదేదో మాట్లాడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ దాడిని తట్టుకోలేకపోయిన బీజేపీ శ్రేణులు ఆగ్రహంతో ఊగిపోయారు. ప్రెస్ మీట్ జరుగుతున్న టైంలోనే మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై దాడికి తెగబడ్డారు. లోపల ప్రెస్ మీట్ జరుగుతున్న టైంలోనే విధ్వంసం సృష్టించారు.

### కౌశిక్ రెడ్డి ఏమన్నాడంటే!

దాడులపై పాడి కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై బీజేపీ, కాంగ్రెస్ కలిపి హత్యాయత్నం చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యేపైనే ఈ స్థాయిలో దాడులు చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. తనను చంపేందుకు ఇప్పటికే రెక్కీ నిర్వహించారని

2లో..

# రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదు

## - హరీశ్ రావు ఆగ్రహం



**హైదరాబాద్** వడ్ల కుప్పల వద్ద రైతుల గుండెల ఆగిపోతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో ఇలాంటి పరిస్థితిని తెలంగాణలో ఎప్పుడూ చూడలేదని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హరీశ్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నెల రోజులుగా వడ్లను కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. వడ్ల కుప్పల వద్దనే రైతుల గుండెలు ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరుగుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారని, కానీ వాస్తవాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయని మండిపడ్డారు.నేను వారిలా ఏసీ గదిలో కూర్చుని మాట్లాడటం లేదని విమర్శించారు. రైతుల మధ్య నిల్చుని, వారి గోడు విని మాట్లాడుతున్నానని అన్నారు. కల్లాలలో రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. తేమ పరీక్షకు పదిరోజులు, గోనె సంచులకు వారం రోజులు, కాంటా (తూకం) పెట్టడానికి మరో వారం రోజులు పడుతుందని ఆరోపించారు. మిల్లులకు

2లో..

# కాంట్రాక్టు కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న సింగరేణి జిఎం పర్సనల్

**సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు పెరిగిన వేతనాల జీఓ వెంటనే విడుదల చేయాలి**

**ప్రతినెల 7వ తేదీ లోపే వేతనాలు చెల్లించాలి.**

**సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు భూక్య రమేష్**



కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి) సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు 2026 సంవత్సరంలో పెరిగిన (విడిఏ) వేతనాలు వెంటనే చెల్లించాలని సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు భూక్యా రమేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కాంట్రాక్టు కార్మికులు పని ప్రాంతాల్లో జరిగిన జనరల్ బాడీ సమావేశం లో భూక్య రమేష్ మాట్లాడారు.అరకొర వేతనాలతో జీవనం సాగిస్తున్న సింగరేణి కాంట్రాక్టు కార్మికులు పెరిగిన విడిఏ ప్రభుత్వ ఉత్తర్వులు వెంటనే విడుదల చేసి వేతనాలు వెంటనే చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం, సింగరేణి జిఎం పర్సనల్ నిర్లక్ష్యంగా వహిస్తున్నారని ఆయన విమర్శించారు. కార్మికుల వేతనాలు పెంచకపోగా, సెంట్రల్ చీఫ్ లేబర్ ఆఫీస్ నుండి పెరిగిన వేతనాల ను చెల్లించకుండా, ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో సమాధానం చెప్పాలని సింగరేణి అధికారులను ఆయన ప్రశ్నించారు . కాంట్రాక్టు కార్మికుల శ్రమతోటి లాభాలు అర్జిస్తున్న సింగరేణి యాజమాన్యం సంబంధిత అధికారులు వెంటనే దృష్టి సారించి పెరిగిన వీడియోను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో సిఐటియు సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు భాస్కర్, గుగులోతు సక్రాం,అనిల్, రమేష్ పాసి , తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడు గవర్నర్ వ్యవహారం హాస్యాస్పదం

**జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**



కొత్తగూడెం (తెలంగాణ వాణి) తమిళనాడు గవర్నర్ వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదని హాస్యాస్పదంగా ఉందని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.గురువారం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన తమిళనాడు రాష్ట్ర ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి ప్రజలు సృష్టమైన తీర్పు ఇచ్చారని,ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు గవర్నర్ ఎందుకు అవకాశం ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు!కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి గవర్నర్ వ్యవస్థను పూర్తిగా రాజకీయ మయం చేశారని విమర్శించారు.2017-2018 లో గోవా,మణిపూర్, మేఘాలయ,కర్ణాటకలలో జరిగిన పరిణామాలను గుర్తుచేశారు.అప్పట్లో ముందు ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇచ్చి,తర్వాత అసెంబ్లీలో ఫ్లోర్ టెస్ట్ నిర్వహించారని అదేవిధంగా ఇప్పుడు తమిళనాడులో కూడా విజయ్ కు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.టీవీకే పార్టీకి దాదాపు మెజారిటీ వచ్చినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వడంలో గవర్నర్ ఎందుకు వెనకడుగు వేస్తున్నారని గవర్నర్ ఈ విధంగా వ్యవహరించడంలో బీజేపీ పాత్ర లేదా అని ప్రశ్నించారు.రాజ్యాంగ హక్కులు రాజకీయ నాయకులకు మాత్రమే కాదని,ప్రజలకు కూడా తెలుసన్నారు.ఇప్పటికైనా గవర్నర్ విజయ్ కి ప్రభుత్వం ఏర్పాటు చేసే మొదటి అవకాశం ఇవ్వాలని,108 మంది ఎమ్మెల్యేలతో టీవీకే అతిపెద్ద పార్టీగా నిలిచిందని,విజయ్ మాత్రమే ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకు వచ్చారని,మరే ఇతర పార్టీలు ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ను కోరనప్పుడు గవర్నర్ ఎందుకు ఆలస్యం చేస్తున్నారని,గవర్నర్ వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం గవర్నర్ వ్యవస్థను వాడుకుంటుందని విమర్శించారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు,ధనుంజయ్,ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

# 99 ఒక అద్భుతమైన ఘట్టం




లక్ష్మీదేవిపల్లి (తెలంగాణ వాణి) లోతు వాగు రైతువేదికలో గురువారం నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక--99 కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా పెద్ద తండా సర్పంచ్ లావుడ్య పూర్ణ గారు గ్రామ అభివృద్ధి అంశాలపై కీలక సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ, గ్రామంలో దూరంగా ఉన్న విద్యుత్ స్తంభాల మధ్య కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి, లూజ్‌గా ఉన్న కరెంటు తీగలను బిగించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఆర్ అండ్ బి డబుల్ రోడ్డును దృష్టిలో ఉంచుకుని, రోడ్డు క్రాసింగ్ వద్ద భారీ పోల్స్ ఏర్పాటు చేసి, రైతులు ధాన్యం రవాణా చేసేటప్పుడు ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వీధి దీపాల కేబుల్స్‌ను కొత్తగా బిగించి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. అదేవిధంగా పెద్ద తండా మరియు ఉయ్యాలవాడ గ్రామాల మధ్య వీధి దీపాలు ఏర్పాటు చేసేందుకు కొత్త స్తంభాలు వేయాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ స్థాయిలో సమస్యలను వెలికి తీసి, వాటికి త్వరితగతిన పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ అభివృద్ధికి మరింత వేగం చేకూరుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లకు అనుమతులు తప్పనిసరి

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్ అంకిత్



కొత్తగూడెం (తెలంగాణ వాణి) ప్రీ కాన్సెప్షన్ అండ్ ప్రీ నేటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ (పీసీపీఎన్డిటి) చట్టం, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలుపై జిల్లాస్థాయి సమీక్ష సమావేశం గురువారం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ కేంద్రాలు, ల్యాబ్‌ల నిర్వహణ, అనుమతులు, నిబంధనల అమలుపై సమావేశంలో సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్‌కు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ఆసుపత్రులు, ల్యాబ్‌లపై కఠిన చర్యలు తీసుకుని అవసరమైతే సీజ్ చేయాలని సూచించారు. అనుమతులు లేకుండా లేదా నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న డయాగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. వైద్యశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లలో ఉన్న లోపాలను గుర్తించి వారికి తగిన సూచనలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలు, నిబంధనలు పాటించని సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సీజ్ చేయాలని స్పష్టం చేశారు. డయాగ్నస్టిక్ సెంటర్లలో పరీక్షల ధరల పట్టిక తప్పనిసరిగా ప్రదర్శించాలని, ప్రజల నుంచి అధిక ధరలు వసూలు చేయకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అలాగే ప్రతి సంస్థలో రిజిస్ట్రేషన్ పత్రాలు, అనుమతులు, అర్హత కలిగిన సిబ్బంది వివరాలు అందుబాటులో ఉండాలని తెలిపారు. అర్హతలు లేకుండా వైద్యం నిర్వహిస్తున్న ఆర్ఎంపీ వైద్యులపై కూడా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. అర్హతలకు మించి వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించినట్లయితే సంబంధిత ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను వెంటనే సీజ్ చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ వైద్య సేవలను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రీ కాన్సెప్షన్ అండ్ ప్రీ నేటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ చట్టాన్ని జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేయాలని, గర్భ లింగ నిర్ధారణ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎటువంటి ఉపేక్ష ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. స్కానింగ్ సెంటర్ల రికార్డులు, రిజిస్టర్లు, ఫారమ్‌లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

సమావేశంలో భాగంగా రెన్యువల్ కోసం వచ్చిన 46 దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. వైద్యశాఖ అధికారులు చెక్ లిస్ట్ ఆధారంగా అన్ని ఆసుపత్రులు, ల్యాబ్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్, , పాల్వంచ డి.ఎస్.పి సతీష్ కుమార్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరావు, ఎన్జీవో ప్రోగ్రామ్ ఆఫీసర్ సంజీవరావు, డాక్టర్ రాందాస్, డాక్టర్ హరీష్, డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగలక్ష్మి, బేబీ హెల్త్ ఎడ్యుకేటర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# కోదాడ బస్టాండ్ ముందు మహిళ హత్య

**సూర్యాపేట** అందరూ చూస్తుండగానే బార్య శిరీషను భర్త మణిదీప్ కత్తితో పొడిచి చంపాడు. కుటుంబ కలహాల నేపద్యంలో హత్య జరిగినట్టు అనుమానం. ఏపీ లోని కృష్ణా జిల్లా జగ్గయ్యపేటకు చెందిన దంపతులు శిరీష,మణిదీప్ ఆరెళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. శిరీష్ (24) కు తల్లితండ్రులు లేరు.

మణిదీప్ లారీ డ్రైవర్. వీరికి రెండేళ్ల బాబు ఉండగా, ఏడాది క్రితం ఇద్దరి మధ్య గొడవలు జరగడంతో పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకొని కలిసి ఉంటున్నారు.వీరి మధ్య మరోసారి గొడవ జరగగా పోలీస్ స్టేషన్కు వెళ్లడంతో పోలీసులు వారికి నచ్చజెప్పి పంపారు. పోలీస్ స్టేషన్ నుండి బయటికి వచ్చి తన పెద్దమ్మతో కలిసి జగ్గయ్యపేట వెళ్లేందుకు ఆటో ఎక్కుతుండగా, ఒక్కసారిగా ఆమెను ఆటో నుండి మణిదీప్ భార్యను లాగాడు. ప్రాణభయంతో ఆమె టీ స్టాల్లోకి పరుగులు తీయగా, ఆమెను వెంటాడి అందరు చూస్తుండగానే కత్తితో పొడిచి చంపాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మణిదీప్ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# వర్ధన్నపేటలో రైతుల రాస్తారోకో

**వరంగల్** వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలో రైతులు ధర్నా కు దిగారు. మార్కెట్లో వడ్లు పోసి వారం రోజులైనా కొనుగోలు చేయడం లేదని ఇల్లంద అంబేద్కర్ సెంటర్ వద్ద ధర్నాకు దిగారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు రైతులను బీఆర్ఎస్ రైతులు, బీజేపీ రైతులు, కాంగ్రెస్ రైతులు అని విభజించి ఇబ్బందులకు గురి చేస్తున్నారంటు మండిపడ్డారు.

కాంటాలు ప్రారంభిచాలని కలెక్టర్ చెప్పినా అధికారులు వినడంలేదని నినాదాలు చేసారు. దేశానికి అన్నం పెట్టే రైతులు పంట కొనమని కాళ్లు మొక్కాల్సి వస్తుందని ఆవేదన పడ్డారు. వడ్ల కొనుగోలు ప్రారంభించే వరకు ధర్నా విరమించేది లేదని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై బైఠాయించారు.

# తెలుగు రాష్ట్రాల్లో తమిళ పాలిటిక్స్ హీట్

**హైదరాబాద్,** విజయ్ విజయం తమిళనాడు పాలిటిక్స్‌లో హిస్టరీని క్రియేట్ చేసింది. కానీ తెలుగు స్టేట్స్‌లో దళపతి విక్టరీ రీసౌండ్ చేస్తోంది. ఏకంగా అధికార కూటమి, ప్రతిపక్ష వైసీపీ మధ్య సోషల్ మీడియా వార్‌కు దారితీసింది. ఇక సినీ స్టార్‌గా కెరీర్ ప్రారంభించి..పాలిటిక్స్‌లోకి వచ్చిన పవన్‌ను..విజయ్ విజయంతో పోలుస్తూ ట్రోల్ చేస్తున్న పరిస్థితి. ఇటు కేసీఆర్‌ను కూడా వదలడం లేదు సోషల్ మీడియా. విజయ్ విజయంపై ఇక్కడెందుకు ఇంత చర్చ? టీవీకే గ్రాండ్ విక్టరీ సెంట్రిక్‌గా ఒకరినొకరు ఎందుకు టార్గెట్ చేసుకుంటున్నట్లు?తెలుగు వార్తలుపార్టీ పెట్టిన రెండేళ్లలోనే విజయం. ఎంజీఆర్, ఎన్టీఆర్ తర్వాత ఆ స్థాయి రికార్డు విక్టరీ. అందుకే విజయ్ విజయం దేశం మొత్తం రీసౌండ్ చేస్తోంది. తెలుగు స్టేట్స్‌లో అయితే పొలిటికల్ హీట్‌ను..సోషల్ మీడియా ఫైట్‌ను మరో స్టేజ్‌కు తీసుకెళ్లింది. విజయ్ సాధించిన గెలుపుతో అందరూ ఆ క్రెడిట్‌లో భాగమయ్యేందుకు గేమ్ షురూ చేశారు. విజయ్ ప్రచారంలో ఓ అభిమాని జగన్‌తో ఆయన కలిసి ఉన్న ఫోటోను ఇస్తే..విజయ్ ఆ ఫోటోను తీసుకుని జనాలకు చూపించారు. ఆ విజువల్స్‌ను పోస్ట్ చేసి వైసీపీ సోషల్ మీడియా క్రెడిట్ కొట్టేసే ప్లాన్ చేస్తోంది. తమ అధినేత ఫోటో పెట్టుకుని విజయ్ గెలిచారన్నట్లుగా ఫ్యాన్ పార్టీ కలరింగ్ ఇస్తే..టీడీపీ స్ట్రాంగ్ కౌంటర్ ఇస్తోంది. జగన్ ఫోటో పెట్టుకుని విజయ్ గెలిస్తే..జగనే అధ్యక్షుడిగా ఉండి వైసీపీని ఎందుకు 11 సీట్లకే పరిమితం చేశారో చెప్పాలని కూటమి నుంచి అటాక్ స్టార్ట్ అయింది.

ఇక వైసీపీ మాజీమంత్రి రోజాను కూడా వదిలిపెట్టడం లేదు సోషల్ మీడియా. ఆమె డీఎంకేకు ప్రచారం చేశారని..ఆమె ఎక్కడ అడుగు పెడిగే అక్కడ నాశనమే..ఐరన్ లెగ్ అంటూ ట్రోల్స్ చేస్తున్నారు.ఇక అన్నింటికి మించి పవన్ సెంట్రిక్‌గా సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చ అంతా ఇంతా కాదు. విజయం అంటే విజయ్‌ది అని..ఒంటరిగా పోటీ చేసి తన బలంతో ..తానే 234 చోట్ల అభ్యర్థినని చెప్పి గెలిచారని హోరెత్తిస్తున్నారు. విజయ్‌తో పవన్‌ను పోలుస్తూ..ఏపీలో జనసేన పార్టీ పెట్టిన పదేళ్ల తర్వాత పవన్ డిప్యూటీ సీఎం అయ్యారంటూ ఎద్దేవా చేస్తున్నారు ఆయన రాజకీయ ప్రత్యర్థులు. 21 సీట్లు గెలిచే వంద శాతం స్ట్రైక్ రేట్ అని చెప్పుకుంటున్న జనసేనాని..విజయ్ సాధించిన విజయం తర్వాత ఎలా రియాక్ట్ అవుతారో అంటూ పోస్టులు పెడుతున్నారు. ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్నట్లుగా ఉందని..విజయ్ విజయం..పవన్‌కు హెడెక్‌గా మారిందని వైసీపీ నేత అంబటి రాంబాబు ట్వీట్ చేసి చర్చకు దారితీశారు.సేమ్‌టైమ్ తెలంగాణ మాజీ కేసీఆర్‌ను కూడా కాంగ్రెస్ సోషల్ మీడియా ఓ రేంజ్‌లో ట్రోల్ చేస్తోంది. విజయ్ పార్టీ పెట్టే ముందు గులాబీ బాస్‌ను కలిశారని..ఆ తర్వాత తమిళనాడు ఎన్నికల్లో ఘన విజయం సాధించారని బీఆర్ఎస్ సోషల్ మీడియా పోస్టులు పెడుతుంది. అయితే గులాబీ పార్టీకి అదే స్థాయిలో కాంగ్రెస్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చేస్తోంది. స్టాలిన్ నుంచి మమత వరకు..కేజ్రీవాల్ నుంచి పినరయ్ విజయన్ వరకు..కేసీఆర్‌ను కలిసిన అందరూ..చివరకు జగన్ కూడా..సీఎం పదవిని కోల్పోయారని ట్రోల్స్ చేస్తున్నారు. దొర హ్యాండ్ ఎంత దరిద్రమైందో అంటూ కాంగ్రెస్ సోషల్ మీడియా పెట్టిన పోస్ట్ ఫుల్ వైరల్ అవుతోంది.ఆంధ్రప్రదేశ్ వార్తలుఇలా విజయ్ విజయం చుట్టూ తెలుగు స్టేట్స్‌లో పెద్ద రచ్చే జరుగుతోంది. టీవీకే విక్టరీని తమకు అడ్వాంటేజ్‌గా మలుచుకునేందుకు..ఏపీలో వైసీపీ కార్యకర్తలు, నేతలు టపాసులు కాల్చి, కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. క్రెడిట్ ఫైట్‌లో భాగంగా..ఎవరికి వారు సెల్ఫ్ ఎలివేషన్‌కు ప్రయారిటీ ఇవ్వడంతో వార్ పీక్స్‌కు చేరింది. దీంతో విజయ్ సెంట్రిక్‌గా ఒకరిని టార్గెట్ చేసుకుంటూ మరొకరు పోటాపోటీ పోస్టులతో హోరెత్తిస్తున్నారు. విజయ్ విజయం చుట్టూ తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న చర్చ ఇంకెంత దూరం వెళ్తుందో చూడాలి.

# వివిఐపీ కల్చర్‌కు స్వస్తి

అధికారంలో ఉన్నవారు ప్రజలకు సేవకులుగా ఉండాలే తప్ప, పాలకుల్లా ఇబ్బందులు సృష్టించకూడదనే సంకేతాన్ని ఈ చర్య ద్వారా సీఎం రేవంత్ రెడ్డి పంపారు.

## పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం రద్దు

వెల్లడించారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా కేంద్రమంత్రులు, పలు రాష్ట్రాల సీఎంలు హాజరు కానున్నట్లు తెలిపారు.

## కరీంనగర్‌లో రణరంగం

ఇదే విషయాన్ని ఉదయం పెట్టిన ప్రెస్ మీట్‌లో చెప్పానని అన్నారు. అదే ఇప్పుడు కనిపించిందన్నారు. తనను చంపేందుకు కత్తులు, బాంబులు, రాడ్లతో వచ్చారని అన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ దారి తప్పిందని చెప్పడానికి వరుసగా జరుగుతున్న ఘటనలే ఉదాహరణ అని అన్నారు. దాడులు చేసిన వారిపై కఠినంగా శిక్షించాలని పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలన్నారు. వారిని వెంటనే రిమాండ్‌కు తరలించాలని అన్నారు. తాను ఎవరినీ రెచ్చగొట్టలేదని అన్నారు. బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు తాము రియాక్ట్ అయ్యామని

## రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదు

వెళ్లిన తర్వాత కూడా లారీకి నాలుగైదు బస్తాల వరకు కటింగ్ పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఆందోళనతో ఉన్నారని హరీశ్ రావు అన్నారు. చౌటుప్పల్ మార్కెట్‌లో వర్షం పడితే కనుక వడ్ల కుప్పలు నీట మునిగే ప్రమాదం ఉందని అన్నారు. ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేశారు. రైతుబంధు, యూరియా, రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. తరుగు పెడితే తోలు తీస్తామని గతంలో సీఎం చెప్పారని, ఇప్పుడు బస్తాకు రెండు మూడు కిలోల తరుగు తీస్తుంటే ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు.

## జనగణన అవగాహనకు

# మార్నింగ్ వాక్

**- అవగాహన ర్యాలిలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్, హేమంత్ కేశవ్ పాటిల్ పిలుపు**



**అచ్చంపేట (తెలంగాణ వాణి ప్రతినిధి)** 2027 జనగణన కార్యక్రమం నిర్వహణకు సంబంధించి జిల్లాలో సిబ్బందికి నాలుగు విడతల్లో సమగ్ర శిక్షణ విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. ఈ నెల 11 నుంచి ప్రారంభమయ్యే తొలి విడత ఇంటింటి జనగణన కోసం 1,567 మంది ఎన్యూమరేటర్లు, 274 మంది సూపర్వైజర్లకు ప్రత్యేక శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. జనగణన నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయని, సిబ్బంది పూర్తిగా సిద్ధంగా ఉన్నారని తెలిపారు.ప్రజలు ఈ నెల 10వ తేదీలోగా స్వీయ గణన ప్రక్రియ పూర్తి చేసి జనగణన కార్యక్రమానికి సహకరించాలని కలెక్టర్ కోరారు. జనగణనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు (నేడు) శుక్రవారం ఉదయం 6.30 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ క్రీడా మైదానం నుంచి మార్నింగ్ వాక్‌తో పాటు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పత్రికా ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# పుట్టు చీర కార్యక్రమంలో వినూత్న ఆలోచనతో కానుక



వనపర్తి : మే 7, తెలంగాణ వాణి ప్రతినిధి : ప్రేమ్ టైలర్స్ నానమోని మన్నెం వినూత్న ఆలోచనతో ప్లాస్టిక్ పేపర్ ప్లేట్లు గ్లాసుల్లో వాటిల్లో వాటర్ తగరాదని స్టీల్ ప్లేట్లు స్టీల్ గ్లాసులు వాటర్ బాటిల్స్ మనం మటన్ షాప్ కు వెళ్లినప్పుడు స్టీల్ బాక్స్ లో తెచ్చుకోవాలని , పాల కేంద్రానికి వెళ్ళినప్పుడు స్టీల్ క్యాన్లో తెచ్చుకోవాలని వినూత్న ఆలోచనతో గురువారం ఆర్ జి గార్డెన్లో శ్రీ లక్ష్మి పుట్టు చీర కార్యక్రమం సురేష్ గౌడ్ కార్యక్రమంలో ప్లాస్టిక్ వాడరాదని. స్టీల్ సామాగ్రిని బహుకరించడం జరిగింది. పేపర్ ప్లేట్స్ కావు క్యాన్సర్ ప్లేట్స్ దయచేసి ప్లాస్టిక్ గ్లాసులు, పేపర్ ప్లేట్లు తినకండి. ప్లాస్టిక్ కవర్లల్ పార్సెల్ తీసుక వెళ్తున్నారా క్యాన్సర్ ఇంట్లోనికి వస్తున్నట్లే ఆదివారం మార్కెట్ కు వెళుతున్నామా మాంసం కోసం స్టీల్ డబ్బాలు తీసుకువెళ్లండి కూరగాయల కోసం కాటన్ జూట్ బ్యాగులను తీసుకువెళ్లండి మన ఆరోగ్యం మన పర్యావరణాన్ని కాపాడుకుందాం. ప్లాస్టిక్ వాడొద్దు ప్రకృతిని కాపాడండి. మన చిన్న మార్పు పెద్ద ప్రభావం. మన చిన్న ప్రయత్నం మన భవిష్యత్తుకు పెద్ద రక్షణ. ప్రతి ఒక్క కార్యక్రమంలో మనం వేడి అన్నం తినేటప్పుడు ప్లాస్టిక్ ప్లేట్లలో తింటే రాదు అన్నారు. ఇట్టి కార్యక్రమంలో భాను ప్రకాష్, శ్రీనివాసులు,అశోక్ రెడ్డి, గోపాల్ సుంకరి రమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సొమ్ము దుర్వినియోగంపై

## అధికార పార్టీ నేతల మధ్య బహిరంగ విమర్శలు




చర్ల (తెలంగాణ వాణి) చర్ల మండల కేంద్రంలో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనుల విషయంలో అధికార పార్టీ నాయకులే పరస్పరం ఆరోపణలు చేసుకోవడం ప్రజల్లో చర్చనీయాంశంగా మారిందని బీఆర్ఎస్ పార్టీ చర్ల మండల కమిటి పేర్కొంది. ప్రభుత్వ పనుల్లో అధికార పార్టీ నాయకులు కాంట్రాక్టర్లుగా వ్యవహరిస్తూ ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని అధికార పార్టీకి చెందిన వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులే బహిరంగంగా ఆరోపణలు చేయడం గమనార్హమని తెలిపారు. ప్రజల నుండి పన్నుల రూపంలో సేకరించిన నిధులను ప్రజాప్రయోజనాల కోసం వినియోగించాల్సి ఉండగా, చర్ల పట్టణంలో నిర్మిస్తున్న నీటి ట్యాంకు పనులు, బస్సు స్టాండ్ నుండి సాయిబాబా గుడి వరకు చేపడుతున్న రహదారి, పక్క కాలువ నిర్మాణాల్లో అక్రమాలు జరిగాయని అధికార పార్టీ ప్రజాప్రతినిధులే ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. కోట్ల రూపాయల ప్రజా ధనం వృథా అవుతుందనే విమర్శలు రావడం ఆందోళనకరమని తెలిపారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ అధికారులు, ముఖ్యంగా భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ తెల్లం వెంకట్రావు స్పందించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాలను కాపాడటంలో ముందుంటానని చెప్పే శాసనసభ్యుడు, ఇప్పుడు జరుగుతున్న ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని, చర్ల మేజర్ పంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్, స్థానిక అధికారులపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీకి చెందిన ఇద్దరు నాయకుల మధ్య వైరం కారణంగా చర్ల పట్టణ ప్రజలు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతోందని బీఆర్ఎస్ మండల కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. అధికారులు వెంటనే జోక్యం చేసుకుని ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను తక్షణమే పూర్తి చేయించాలని కోరింది.

# ఈనెల 12న టి జి ఎడ్ సెట్ ప్రవేశ పరీక్ష

హనుమకొండ (కాకతీయ యూనివర్సిటీ) తెలంగాణ వాణి 7/5/2026 తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన టి జి ఎడ్ సెట్-- 2026 ప్రవేశ పరీక్షను ఆన్లైన్ విధానంలో (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) మే 12వ తేదీన నిర్వహించనున్నట్లు టి జి ఎడ్ సెట్-- 2026 కన్వీనర్ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ పరీక్ష తెలంగాణ రాష్ట్రంలోని 16 ప్రాంతీయ కేంద్రాలలోని 59 పరీక్షా కేంద్రాల్లో రెండు సెషన్లలో జరుగుతుందని పేర్కొన్నారు. మొదటి సెషన్ ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, రెండవ సెషన్ మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. మే 7వ తేదీ వరకు మొత్తం 35,482 మంది అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని వెల్లడించారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు మే 8 మరియు 9 తేదీలలో రూ.5,000/- అపరాధ రుసుముతో తమ దరఖాస్తులను సమర్పించుకోవచ్చని తెలిపారు. అలాగే, టి జి ఎడ్ సెట్-- 2026 హాల్ టికెట్లను మే 9వ తేదీ ఉదయం 10.00 గంటల నుండి అధికారిక వెబ్సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చని కన్వీనర్ తెలిపారు.

# భీభత్సవమైన గాలివాన చెదిరిన గుడిసె



ధర్మారం: ఏప్రిల్ 7 (తెలంగాణ వాణి ) ధర్మారం మండలం కొత్తూరు గ్రామంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు, గాలివాన బీభత్సానికి గుగులోత్ సంజీవ్ నాయక్‌కు చెందిన పూరి గుడిసె దెబ్బతింది. గుడిసెపై కప్పిన కవర్లు ఎగిరిపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిరుపేద కుటుంబమైన వీరుఇప్పటికి పూరి గుడిసెలోనే నివాసం ఉంటూ గుడిసెపై కవర్లు కప్పుకొని జీవనం కొనసాగిస్తున్నారు. తీవ్రమైన గాలివానతో కూడిన వర్షం పడినప్పుడల్లా ఈ కుటుంబం బిక్కుబిక్కుమంటూ జీవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇంటి స్థలం తప్ప గుంట భూమి కూడా లేదు అధికారులు నాయకులు స్పందించి తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని బాధితుడు సంజీవ్ వేడుకున్నాడు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు ఇప్పించాలి

**- జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి**

**- సీఎం పెళ్లిరోజు సందర్బంగా పెద్దమ్మతల్లీ ఆలయంలో సీఎం కుటుంబం పేరిట అర్చన,**

జగిత్యాల /బుగ్గారం (తెలంగాణ వాణి విలేకరి) జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం సందయ్య పల్లె నివాసి ఎన్నం కిషన్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి-గీత, వారికి జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్. ఎం.సంజయ్ కుమార్ - రాధిక ల పెళ్లి రోజు సందర్బంగా ఇరువురు నేతల కుటుంబాలు బాగుండాలని, వారు గురువారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని పెద్దమ్మ తల్లీ, ఫిల్మ్ నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో కిషన్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్బంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ పాత్రికేయుల పట్ల సానుకూలంగా ఉండి రాష్ట్రంలోని అన్నీ జిల్లాలతో పాటు జగిత్యాల జిల్లా కేంద్రంలో పని చేస్తున్న వారి అందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.అన్నీ కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేసే విధమైన హెల్త్ కార్డులు, కొన్నేళ్లుగా నిలిచిపోయిన రైల్వే పాసులు పునరుద్ధరించే విధంగా కేంద్రంతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సీఎం ను కోరారు.జగిత్యాల జిల్లా కేంద్రములో మరియు బుగ్గార మండల కేంద్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు ఇప్పిశీచేలా చూడాలని కోరుతూ ఎమ్మెల్యే కుటుంబానికి పెద్దమ్మతల్లీ, వెంకటేశ్వర స్వామిల దీవెనలు ఉండాలని మొక్కుకునట్లు కిషన్ రెడ్డి వివరించారు. కిషన్ రెడ్డి వెంట శ్రీనివాస్,ఆయన్స్,మంద మధు, కేశవ్, ప్రశాంత్, ఆధ్వి తదితరులఉన్నారు.



# అకాల వర్ష ప్రభావం వల్ల ఇబ్బందికి గురి అయిన రైతులు



జగిత్యాల /బుగ్గారం: 07 మే (తెలంగాణ వాణి విలేకరి) జగిత్యాల జిల్లా బుగ్గారం మండల పలు గ్రామాల్లో అనుకోకుండా గాలి వానలతో కూడుకొని వర్షం రావడంతో ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగింది. గాలి వాన సమయమున రైతులకు తార్పల్ దొరకగా సతమతమవుతూ కష్టపడ్డారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో సొసైటీ యాజమాన్యం కావచ్చు ఐ కెపి సెంటర్ యాజమాన్యం కావచ్చు రైతులపై శ్రద్ధ చూపి సాధ్యమైనంత తొందరలో మిల్లులకు వడ్లను తరలించాలంటూ రైతులు కోరారు. రైతులు ఎట్లాగు వరి ధాన్యం ఎక్కువ పండిస్తున్నారు అంటూ మిల్లుల యాజమాన్యం కూడా ఇష్టానుసారం దోచుకోవడం రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదని రైతులు దిగులుకు లోన్ అవుతున్నామంటూ తెలియజేశారు. ఇంతలో వర్షం వచ్చే రోహిణి కార్తి ఈనెల 25 తారీఖున ఉన్నందున వడ్ల కొనుగోలు కేంద్రాల్లో వడ్లను మిల్లుల యాజమాన్యంతో మాట్లాడి స్థానిక ప్రభుత్వ అధికారులు వడ్లను తొందరగా తరలించాలంటూ రైతులు కోరారు.

# రేవంత్ రెడ్డి, బీర్ల ఐలయ్య చిత్రపటాలకు పాలాభిషేకం



రాజపేట మే: 07(తెలంగాణ వాని విలేఖరి) రాజాపేట మండల కేంద్రంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా కుర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డి బీర్ల ఐలయ్య ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నమిలి మహేందర్ గౌడ్, ఐరేని నవీన్, ఉప సర్పంచ్ నమిలే క్యా దారి హైదరాబాద్ మీ నా డాక్టర్ రవి, పాండవుల బసవయ్య, ఇంకా కాంగ్రెస్ పార్టీ నాయకులుసర్పంచులు మాజీ సర్పంచులు, గ్రామ శాఖ నాయకులు సర్పంచులు కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం నిల్వ సామర్థ్యాన్ని పరిశీలించిన కలెక్టర్



నిర్మల్, మే:07(తెలంగాణ వాణి ప్రతినిధి) జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు, సేకరించిన ధాన్యాన్ని భద్రపరిచేందుకు అవసరమైన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం మామడ, లక్ష్మణచాంద మండలాల్లో పర్యటించిన కలెక్టర్, ధాన్యం నిల్వకు అందుబాటులో ఉన్న గోదాములు, రైస్ మిల్లులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మామడ మండల కేంద్రంతో పాటు లక్ష్మణచాంద మండలంలోని తిరుపెల్లి గ్రామంలో ఉన్న రైస్ మిల్లుల ఆవరణలను కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడి గోదాముల నిల్వ సామర్థ్యం, ధాన్యం భద్రత కోసం తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మిల్లుల వద్ద సరిపడా టార్పాలిన్లు, ఇతర అవసరమైన వసతులు సిద్ధంగా ఉంచుకోవాలని మిల్లర్లకు సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే గోదాములకు తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నిల్వ సామర్థ్యం విషయంలో ఎటువంటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని పేర్కొన్నారు.ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, తహసీల్దార్ సరిత, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అయోధ్య-కాశీల్లో కూచిపూడి కళా వైభవం

**రామాయణం, శివతత్వంతో ఆకట్టుకున్న చిన్నారులు**

**సనాతన సంస్కృతిని ప్రతిబింబించిన నృత్య ప్రదర్శనలు**

**దేవిశ్రీ చైతన్యలహరి అకాడమి విద్యార్థులకు ప్రశంసలు**



పటాన్ చెరు, మే 7 (తెలంగాణ వాణి రిపోర్టర్) అయోధ్య, కాశీ పుణ్య క్షేత్రాల్లో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనల్లో రామచంద్రాపురం లోని దేవిశ్రీ చైతన్య లహరి కూచిపూడి డ్యాన్స్ అకాడమి విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. భారతీయ సనాతన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా చిన్నారులు ఇచ్చిన ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. శ్రీ సాయి నటరాజ ఆర్ట్స్ అకాడమి తిరుపతి, ఆర్టిస్ట్ ఫ్యాక్టరీ వైజాగ్ ఆధ్వర్యంలో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో నాట్య గురువు మంజాల పద్మజ ఆధ్వర్యంలో దాదాపు పది మంది చిన్నారులు పాల్గొన్నారు. కాశీలోని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగిన "మ్యూజిక్ డ్యాన్స్ ఉత్సవ్--2026"లో చిన్నారులు శివతత్వాన్ని ఇతివృత్తంగా తీసుకుని ప్రదర్శించిన నృత్యం సభికులను మంత్ర ముగ్ధులను చేసింది. అనంతరం అయోధ్యలో శ్రీరామ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో రామాయణం, అన్నమాచార్య కీర్తనలను నృత్య రూపంలో ఆవిష్కరించి ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమాల అనంతరం నిర్వాహకులు చిన్నారులకు ప్రశంసా పత్రాలు, అవార్డులు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా నాట్య గురువు మంజాల పద్మజ మాట్లాడుతూ పుణ్యక్షేత్రాల్లో భారతీయ శాస్త్రీయ నృత్యాలను ప్రోత్సహించడం ద్వారా యువతకు మన సంస్కృతిపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చడం ఆనందంగా ఉందన్నారు.

# బీజేపీ కార్యకర్తల దాడి అత్యంత అమానుషం

**- మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్**

**- ఎమ్మెల్యే వాహనం ధ్వంసం దుర్మార్గ చర్య**

**- బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరిక**

**- దుండగులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్**



హుస్నాబాద్ (తెలంగాణ వాణి) కరీంనగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై బీజేపీ కార్యకర్తలు దాడికి పాల్పడటం అత్యంత అమానుషమని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి దాడులకు తావులేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పట్ల బీజేపీ, కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొడుతూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను అపార్థం చేసుకుని ఈ దాడికి దిగడం దుర్మార్గమని ఆయన విమర్శించారు.క్యాంపు కార్యాలయంపై దాడి చేయడమే కాకుండా ఎమ్మెల్యే వాహనాన్ని ధ్వంసం చేయడం బీజేపీ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని సతీష్ కుమార్ మండిపడ్డారు.ఏవైనా రాజకీయ విభేదాలు ఉంటే క్షేత్రస్థాయిలో రాజకీయంగా ఎదుర్కోవాలి తప్ప, భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు.కార్యాలయంపై దాడికి తెగబడిన దుండగులను గుర్తించి, వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఇలాంటి చర్యలను ఉపేక్షిస్తే సహించేది లేదని, భవిష్యత్తులో బీజేపీకి ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

# ఘనంగా అల్లూరి సీతా రామరాజు వర్థంతి వేడుకలు



మందమర్రి టౌన్ (తెలంగాణ వాణి) స్వాతంత్ర్య సమర యోధులు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకొని గురువారం మందమర్రి పట్టణంలోని మాజీ ఆర్మీ జవాన్ ప్రస్తుత ఎస్ అండ్ పిసి ఉద్యోగి రాజేష్ పీవ్ హాల్, రాణి పివ్ హాల్ దంపతులు ఆధ్వర్యం లొ తన నివాసంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావాలనే బలమైన సంకల్పంతో, గిరిజనులపై బ్రిటిష్ వారి అటవీ చట్టాల (పోడు సాగు నిషేధం) వల్ల జరిగిన అన్యాయాన్ని ఎదిరించారని అన్నారు.గిరిజనులను కూడగట్టి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం మార్గమని గెరిల్లా పోరాటం సాగించాడని అన్నారు.అల్లూరి ని ప్రతి ఒకరు స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్మెంట్ కార్మికుడు పెందోట వెంకట నరసయ్య పాల్గొన్నారు.

# టిఎన్జీవో జిల్లా కార్యదర్శి

## శ్రావణ్ కుమార్ కు ఘన సన్మానం



మంచిర్యాల, మే 07 (తెలంగాణ వాణి): ఇటీవల టీఎన్జీవో జిల్లా కార్యదర్శిగా నియమితులైన బొడ్డు శ్రావణ్ కుమార్ ను టీఎన్జీవో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గురువారం జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలో గల టీఎన్జీవో భవనంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రావణ్ కుమార్ ను జిల్లా కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో టిఎన్జీవో కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, కోశాధికారి సతీష్ కుమార్, మాజీ కార్యదర్శి భూముల రామ్మోహన్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రామ్ కుమార్, తిరుపతి, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షులు వెంకటేష్, కార్యవర్గ సభ్యులు, అన్ని యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

# టిఎన్జీవో ఆధ్వర్యంలో

## డాక్టర్ అక్షయకు ఘన సన్మానం



మంచిర్యాల, మే 07 (తెలంగాణ వాణి): టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి కుమార్తె డాక్టర్ గడియారం అక్షయ ఇటీవల ఎంబిబిఎస్ లో గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా గురువారం టీఎన్జీవో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని టీఎన్జీవో భవనంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అక్షయ ను, ఆమె తండ్రి టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరిని శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీహరి మాట్లాడుతూ, తన కుమార్తె ఎంబిబిఎస్ లో గోల్డ్ మెడల్ సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఆమె ఇటువంటి మరిన్ని పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా వైద్యురాలిగా అక్షయ పేద వర్గాలకు ఉచిత సేవలు అందించడానికి ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవో జిల్లా కార్యదర్శి శ్రావణ్ కుమార్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, కోశాధికారి సతీష్ కుమార్, మాజీ కార్యదర్శి భూముల రామ్మోహన్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రామ్ కుమార్, తిరుపతి, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షుడు వెంకటేష్, టీఎన్జీవో కార్యవర్గ సభ్యులు, అన్ని యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

# మోడల్ సోలార్ గ్రామంగా

## ఎంపికైన హీరాపూర్ గ్రామాన్ని సందర్శన

### -ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



ఇంద్రవెల్లి, మే : 07 ( తెలంగాణ వాణి ) ఆదిలాబాద్ సర్కిల్ పరిధిలోని ఇంద్రవెల్లి మండలంలో మోడల్ సోలార్ గ్రామంగా ఎంపికైన హీరాపూర్ గ్రామాన్ని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి సందర్శించారు . ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ హీరాపూర్ గ్రామంలో సర్వే పూర్తి అయ్యిందని ఎంపికైన గృహాలు, వ్యవసాయ కనెక్షన్లకు పనులు ప్రారంభించాలని రెడ్కో అధికారులను ఆదేశించారు . ఎటువంటి సమస్యలు ఉన్న మా దృష్టికి తీసుకు రావాలని చెప్పారు . సీఎండీ వెంట సి.ఈ జయవంత్ రావు చౌహాన్ , డి.ఈ ఉట్నూర్ రాం సుబ్బా రెడ్డి , ఏ.డీఈ రోహి దాస్, తదితరులు పాల్గొన్నారు .

# చిర్రకుంటలో అగ్ని ప్రమాదం - ఇల్లు దగ్ధం



మందమర్రి టౌన్ మే 07 (తెలంగాణ వాణి విలేకరి) మండలం లోని చిర్రకుంట గ్రామానికి చెందిన సంద్ర వెంకటస్వామి ఇంట్లో గురువారం జరిగిన అగ్ని ప్రమాదం లో ఇల్లు పూర్తిగా ధ్వంసం అయ్యింది. ఆ సమయంలో ఎవరు ఇంటిలో లేకపోవడంతో మంటలు చేలరేగి ఇల్లు పూర్తిగా దగ్ధం అయ్యింది. ఫైర్ ఇంజన్ సిబ్బంది స్థానిక ప్రజలు మంటలను ఆర్పి పక్క ఇళ్లకు వ్యాప్తి చెందకుండా అరికట్టారు. ఈ ప్రమాదంలో వెంకటస్వామికి సుమారు పది లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానిక సర్పంచ్ శ్రీలత తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గందె రాంచందర్, కాంగ్రెస్ నాయకులు పెద్దల రాజయ్య, సిద్ధం జనార్దన్, రామటెంకి తిరుపతి, ఓదెల సంపత్ రావు రెవెన్యూ. పోలీసు. ఎంపీడీవో కి సమాచారం అందించగా అధికారులు పంచనామా చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అగ్ని ప్రమాద ఘటన పై స్థానిక ఎమ్మెల్యే మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లి భాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వం నుండి నష్టపరిహారం ఇప్పించడానికి కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా భాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా స్థానిక నాయకులు, గ్రామస్థులు తమ వంతుగా 25 కేజీల బియ్యం,నిత్యవసర సరుకులు, 5 వేల రూపాయలు నగదుగా ఎంపీడీవో రాజేశ్వర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ గణపతి చేతుల మీదుగా అందించారు.

# పట్టుదల,క్రమశిక్షణ కలిగి ఉంటే ఉన్నత శిఖరాలను అధిగమించవచ్చు

**- పరీక్షలలో మంచి మార్కులు సాధించిన పోలీసుఅధికారులు సిబ్బంది పిల్లలు -అభినందించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**





కొత్తగూడెం (తెలంగాణ వాణి) ఇటీవల తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచి మంచి మార్కులు సాధించిన జిల్లా పోలీసు అధికారులు,సిబ్బంది పిల్లలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గల కాన్ఫరెన్స్ హాల్ నందు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మొత్తం 63 మంది పోలీస్ సిబ్బంది పిల్లలు,వారి తల్లీదండ్రులు హాజరయ్యారు. ముందుగా మంచి మార్కులు సాధించిన విద్యార్థిని,విద్యార్థులు కొంతమంది తమ తల్లీదండ్రుల కష్టాన్ని,భవిష్యత్తులో తాము సాధించాలనుకుంటున్న లక్ష్యాలను వివరిస్తూ ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకుగాను ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో అహర్నిశలు కష్టపడుతూ ప్రజలకు సేవలు అందిస్తూ తమ పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడుతున్న తల్లిదండ్రులు కష్టాన్ని గుర్తించాలని పిల్లలకు సూచించారు. పట్టుదల,క్రమశిక్షణ,ఆత్మ స్థైర్యం ఉంటే ఎలాంటి కష్టమైన లక్ష్యాన్నైనా సులభంగా సాధించవచ్చని అన్నారు. జీవితంలో ఎల్లప్పుడూ పాఠాలను నేర్చుకుంటూనే ఉండాలని, ప్రతి రోజు ఏదో ఒక కొత్త విషయాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తూ ఉండాలని తెలిపారు. మంచి స్నేహితులను ఏర్పాటు చేసుకొని,దురలవాట్లకు దూరంగా ఉంటూ ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలకు చేరుకొని తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పోలీస్ కుటుంబంలో పుట్టి పెరిగిన ఎస్పీ బాల్యం నుండి ఐపిఎస్ సాధించే వరకు తన గత స్మృతులను వారితో పంచుకున్నారు. అనంతరం మంచి మార్కులు సాధించి ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు కుటుంబంలోని విద్యార్థినీ,విద్యార్థులకు ఎస్పీ ప్రశంసా పత్రాలతో పాటు మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ,చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు,వన్టౌన్ సీఐ కరుణాకర్,త్రీటౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి,ఎంటిఓ సుధాకర్,

# అకాల వర్షంతో తడిసిన ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటాం

**మార్కెట్ యార్డును సందర్శించి పరిస్థితిని సమీక్షించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్, చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి**



ఆదిలాబాద్ ( తెలంగాణ వాణి ప్రతినిధి) ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు అమ్మకానికి తీసుకువచ్చిన మొక్కజొన్న, జొన్న ధాన్యాలు గురువారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంతమంది రైతులకు చెందిన ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపోయిన ఘటన చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి హుటాహుటిన మార్కెట్ యార్డుకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని, రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడటానికి కృషి చేస్తున్నామని అన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ అధికారులు, సిబ్బంది రైతులు ఉన్నారు.

# బిజెపి శ్రేణులు దాడులు చేయడం హేయమైన చర్య

**కరీంనగర్ లో గంగుల, కౌశిక్ రెడ్డి లపై జరిగిన దాడి ప్రజాస్వామ్యం పై దాడే**

**మాజీ మంత్రి, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి వనమా వెంకటేశ్వరరావు**



కొత్తగూడెం (తెలంగాణ వాణి) కరీంనగర్ కు చెందిన బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలపై బిజెపి నాయకులు కార్యకర్తలు మూకుమ్మడిగా దాడి చేయడం హేయమైన చర్య అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ కొత్తగూడెం నియోజకవర్గ ఇన్చార్జ్ వనమా వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయం పై, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై బీజేపీ శ్రేణులు చేసిన దాడి సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలపై దాడి చేయడం అంటే ప్రజల మీద దాడి చేసినట్టేనని వ్యాఖ్యానించారు. కేంద్ర హోం శాఖ సహాయక మంత్రిగా ఉండి దాడులను ప్రోత్సహించడం అత్యంత బాధాకరమని ఆరోపించారు. శాంతిభద్రతలను కాపాడే బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న బండి సంజయ్ బీజేపీ గుండాలతో దాడులు చేపించి, ప్రజలను భయాందోళన, చెందేలా చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధుల క్యాంపు కార్యాలయాలపైనే ముప్పేట దాడులు జరుగుతుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా? లేనట్లా? ఆయన ప్రశ్నించారు. ఏకంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఇలాంటి పరిస్థితులు నెలకొనడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. దాడులకు పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను తెలంగాణ డీజీపీ కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వనమా డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు ఆపకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుందని వనమా వెంకటేశ్వరరావు తన ప్రకటన హెచ్చరించారు.

# వికసించిన "మే" ఫ్లవర్

## అరుదైన పువ్వును చూసి ఆనందిస్తున్న ప్రజలు



కొత్తగూడెం (తెలంగాణ వాణి) సంవత్సరంలో కేవలం మే నెలలో మాత్రమే పూసే మే పుష్పం. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంకు అంతర్భాగంగా ఉన్న విద్యానగర్ కాలనీ లో నివాసముంటున్న ఉపాధ్యాయుడు, పి ఆర్ టి యు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి. వెంకటేశ్వరరావు (డీవీ) ఇంట్లో పూసింది. ఈ పుష్పం శాస్త్రీయ నామం బ్లడ్ లైలీ లేదా ఫబాల్ లైలీ అనికూడా పిలుస్తారు. ఏడాదికి ఒక్కసారి పూసే ఈ పువ్వును చూసేందుకు ఆ ప్రాంతవాసులు ఆసక్తి చూపుతున్నారు.

# పర్సనల్ మేనేజర్ తిరుపతి ని సన్మానించిన టీబీజీకేఎస్ నేతలు



కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి) సింగరేణి కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ గడప రాజయ్య ఆధ్వర్యంలో మణుగూరు నుండి కొత్తగూడెం ఏరియా కు ట్రాన్స్ఫర్ మీద వచ్చిన పర్సనల్ మేనేజర్ తిరుపతిని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ మాట్లాడారు. కార్మికులకు సంబంధించి ఏ సమస్య అయినా పారదర్శకంగా పరిష్కరించాలని, ఎటువంటి అవకతవకలు లేకుండా చూడాలని తిరుపతి ని కోరారు. ఈ యొక్క సన్మాన కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ సభ్యులు వసికార్ల కిరణ్, కాగితపు విజయ్ కుమార్ , బూర్గుల రవికుమార్ , మాదాసు ఈశ్వరయ్య, ఫిట్ సెక్రటరీ సూరజ్, వెంకటేశ్వర్లు, మురళి,విద్యాసాగర్, శ్రీకాంత్, తిరుపతి, అన్వర్,రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నిజ స్వరూపం బయటపడింది

**హైదరాబాద్** కాంగ్రెస్ ఇలా వెన్నుపోటు పొడుస్తుందని అనుకోలేదు. కాంగ్రెస్ వారి నిజస్వరూపాన్ని బయటపెట్టారని డీఎంకే నాయకుడు టీ.ఆర్. బాలు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ కష్టంలో ఉన్నప్పుడు డీఎంకే దానికి మిత్రపక్షంగా వారికి నిలిచినందుకు ఇవాళ మూల్యం చెల్లించుకున్నాము. సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్ తో మెజారిటీ సీట్లు గెలుచుకుని, కూటమి కార్యకర్తల కృషితో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి.. సిగ్గులేకుండా ఐదుగురు ఎమ్మెల్యేలతో ప్రతిపక్షంలోకి వెళ్లిపోయారు. బీజేపీ అన్ని రాష్ట్రాల్లో అధికారాన్ని చేజిక్కించుకోవడానికి చేసినట్లు కాంగ్రెస్ తమిళనాడులో కూడా అదే చేసిందని అయన ఆరోపించారు.

2019 ఎన్నికలలో, రాహుల్ గాంధీని ప్రధానమంత్రి అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించడానికి కాంగ్రెస్ పార్టీయే సంకోచించినప్పుడు.. మా పార్టీ నాయకుడు, ప్రధాన కార్యదర్శి స్టాలిన్, రాహుల్ గాంధీకి మద్దతుగా నిలిచారని అయన గుర్తు చేసారు.

తెలంగాణ వాణి
RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY
The Voice of Telangana
శుక్రవారం, మే 8, 2026

# తమిళనాడులో రాష్ట్రపతి పాలన విధించి, మళ్లీ ఎన్నికలు పెట్టండి.. జోహో శ్రీధర్ డిమాండ్

**చెన్నై,** తమిళనాడులో కొనసాగుతున్న రాజకీయ హైడ్రామా నేపథ్యంలో జోహో శ్రీధర్ స్పందించారు. టీవీకే పార్టీకి అత్యధిక సీట్లు వచ్చినా ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ రాలేదని పేర్కొంటూ.. వెంటనే తమిళనాడులో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఆ ఎన్నికల్లో ఓటుకు నోటు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని శ్రీధర్ వెంబు తెలిపారు.తమిళనాడు ఎన్నికల ఫలితాలు వెల్లడైనా కొత్త ప్రభుత్వ ఏర్పాటు మాత్రం ముందుకు సాగడం లేదు. ఈ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీని ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు గవర్నర్ ఆహ్వానించకపోవడంతో.. తమిళనాడులో రాజకీయ అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో కొత్త కొత్త కూటములు ఏర్పడి అధికారాన్ని చేపడుతాయనే ప్రచారం జరుగుతున్న వేళ.. ఇవాళ మరోసారి గవర్నర్‌ను కలిసినా విజయ్‌కి గ్రీన్ సిగ్నల్ అందడం లేదు. ఈ నేపథ్యంలోనే తమిళనాడు రాజకీయ పరిణామాలపై జోహో సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.గురువారం ఎక్స్ వేదికగా స్పందించిన శ్రీధర్ వెంబు.. తమిళనాడులో తాజాగా ఎన్నికలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం తమిళనాడు ఎన్నికల్లో పార్టీలకు వచ్చిన గణాంకాలను చూస్తే ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లేదని.. ఎలాగోలా సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ.. రకరకాల ఒత్తిళ్ల కారణంగా ఆ ప్రభుత్వం అస్థిరంగానే ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. తమిళనాడు ప్రజలు మెరుగైన పాలనకు అర్హులని శ్రీధర్ వెంబు పేర్కొన్నారు.తమిళనాడులో రాష్ట్రపతి పాలన విధించి.. ఆపై తాజా ఎన్నికలు నిర్వహించడమే ఉత్తమ మార్గమని శ్రీధర్ వెంబు అభిప్రాయం వ్యక్తం చేశారు. మరీ ముఖ్యంగా ఈసారి ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని అడ్డుకుని.. ఓటుకు నోటు లేకుండా కఠినమైన నిబంధనలతో ఎన్నికలు జరిపితే.. తమిళ ప్రజల అసలు తీర్పు ఏంటో తెలుస్తుందని ఆయన వెల్లడించారు.ఒకవేళ తమిళనాడులో మళ్లీ ఎన్నికలు జరిగితే.. విజయ్ నేతృత్వంలోని టీవీకే భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందని శ్రీధర్ వెంబు అంచనా వేశారు. ఒకవేళ విజయ్‌ను అడ్డుకోవాలని భావిస్తే డీఎంకే, అన్నాడీఎంకే కలిసి పోటీ చేయాలని.. అదే సమయంలో తమిళనాడులో తన ఉనికిని చాటుకోవడానికి బీజేపీ ఒంటరిగానే పోరాడాలని శ్రీధర్ వెంబు సూచించారు.మరోవైపు.. 108 స్థానాల్లో గెలిచిన విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ.. ఇప్పటికే 5 సీట్లు గెలిచిన కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించింది. దీంతోపాటు వీసీకే, సీపీఐ, సీపీఎం వంటి పార్టీల మద్దతు కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇక టీవీకే నేతలు అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామిని.. అదే సమయంలో బీజేపీకి మిత్రపక్షమైన పీఎంకే పార్టీకి 4 సీట్లు ఉండగా.. వారిని కూడా కలిశారు.ఇప్పటికే గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను రెండు సార్లు కలిసిన విజయ్.. ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అయితే.. మెజార్టీ మార్కు 118 సీట్ల విషయంలో సంపూర్ణ మద్దతుపై స్పష్టత లేకపోవడంతో గవర్నర్ ఇంకా ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదు. ఈ నేపథ్యంలోనే తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఏర్పడడంపై మరో ఒకటి రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు వర్ధంతి

**- ఘనంగా నివాళులర్పించిన జిల్లా పోలీసులు**

**అనకాపల్లి :** మన్యం వీరుడు, భారత స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా, అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.??జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, పోలీసు అధికారులు మరియు సిబ్బంది ఘనంగా పుష్పాంజలి ఘటించారు. ఆయన త్యాగాలను స్మరిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి సమర్పించారు.?ఈ సందర్భంగా అదనపు ఎస్పీ శ్రీ ఎల్.మోహన రావు గారు మాట్లాడుతూ... బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించిన ధీశాలి అల్లూరి అని, సాయుధ పోరాటం ద్వారానే స్వేచ్ఛ సాధ్యమని నమ్మిన మహనీయుడని కొనియాడారు.?గిరిజనుల హక్కుల కోసం, వారిపై జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా మన్యం ప్రజలను ఏకం చేసిన తీరు అద్వితీయమని పేర్కొన్నారు.?1924 మే 7న ఆయన భౌతికంగా మనకు దూరమైనా, ఆయన చూపిన ధైర్యం, దేశభక్తి ప్రతి భారతీయుడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు.??ఈ కార్యక్రమంలో ఎస్.బి డిఎస్పీ జీ.ఆర్.ఆర్.మోహన్, ఇన్స్పెక్టర్లు టీ.లక్ష్మి, సేనం రమేష్, పిల్లా రమేష్, బి.రామకృష్ణారావు, ఎస్సైలు ప్రసాద్, సురేష్ బాబు, సురేంద్ర కుమార్ మరియు జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొని అల్లూరి కి నివాళులు అర్పించారు.?అల్లూరి వంటి మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, దేశ సేవలో ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఈ సందర్భంగా పోలీసు శాఖ పిలుపునిచ్చింది.

## కేటీఆర్ గురించి మాట్లాడితే తోలు తీస్తాం

**హైదరాబాద్** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెజెడెంట్ కేటీఆర్ గురించి అడ్డగోలుగా మాట్లాడితే తోలు తీస్తామని మాజీ ఎంపీ మాలోత్ కవిత హెచ్చరించారు. ఎమ్మెల్యసీ అద్దంకి దయాకర్ నువ్వు కేటీఆర్ పుట్టుక గురించి మాట్లాడిన మాటలు మీ అమ్మకు చెప్తే నీ దవడ పగలగొడ్తది. నీ పంపకాల గురించి మాట్లాడితే ఎందుకు అంత ఉల్లిక్కి పడుతున్నావు సీతక్క అని ప్రశ్నించారు. మేడారం గద్దెలు కూలి రమేష్ అనే పూజారి కొడుకు కాలు విరిగితే కనీసం పట్టించుకునే సోయి లేదు. మీరు ఎన్ని కేసులు పెట్టినా కేటీఆర్ వెంట్రుక కూడా పీకలేరని అన్నారు.

## పిఠాపురం టీడీపీ ఇన్చార్జ్ పదవి నుంచి వర్మ తొలగింపు

**పిఠాపురం** పిఠాపురం వర్మకు టీడీపీ అధిష్టానం షాకిచ్చింది. నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జ్ పదవి నుంచి తప్పించింది. ఇన్నాళ్లూ టీడీపీ ఇన్చార్జ్గా ఉన్న ఎస్వీఎస్ఎన్ వర్మ స్థానంలో నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనుంది.

## చెంచుగూడెములలో 'మా స్వామి మల్లన్న - మా చెంతకే' కార్యక్రమం

**- హిందూ ధర్మప్రచారంలో భాగంగా చెంచుగూడెములలో 'మా స్వామి మల్లన్న - మా చెంతకే' కార్యక్రమాలు**



మార్కాపురం జిల్లాలోని చింతల చెంచుగూడెంలో సంప్రదాయబద్ధంగా కార్యక్రమ నిర్వహణ సాయంకాలం దేవస్థాన ధర్మప్రచారం రథం ద్వారా శోభాయాత్ర

చింతల చెంచుగూడెంలో శ్రీస్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవంహిందూ ధర్మప్రచారంలో భాగంగా పలు చెంచుగూడెములలో 'మా స్వామి మల్లన్న - మా చెంతకే' కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ఇందులో భాగంగా ఈ రోజు మార్కాపురం జిల్లా చింతల చెంచుగూడెంలో శోభాయాత్ర అనంతరం కల్యాణోత్సవం నిర్వహించబడుతుంది. ఈ రోజు సాయంకాలం గం. 6.30లకు ముందుగా దేవస్థానం ధర్మప్రచారం ద్వారా శోభాయాత్ర నిర్వహించబడుతుంది. తరువాత కల్యాణోత్సవం జరిపించబడుతుంది. కల్యాణోత్సవంలో ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు కల్యాణోత్సవ సంకల్పాన్ని పఠిస్తారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా మరియు శుభప్రదంగా జరగాలని మహాగణపతి పూజ జరిపించబడుతుంది. అనంతరం కంకణపూజ కార్యక్రమాన్ని జరిపి శ్రీ స్వామివారికి కంకణధారణ చేయబడుతుంది. ఆ తరువాత యజ్ఞోపవీత పూజ జరిపి శ్రీ స్వామివారికి యజ్ఞోపవీతధారణ కార్యక్రమం జరిపించబడుతుంది. శ్రీస్వామివారి యజ్ఞోపవీతధారణ అనంతరం కన్యావరణం కార్యక్రమం, గౌరీపూజ, అమ్మవారి కంకణధారణ కార్యక్రమాలు జరిపించబడుతాయి. తరువాత శ్రీ స్వామిఅమ్మవార్ల ప్రవర పఠించడుతుంది. అనంతరం స్వామివారికి వరపూజ నిర్వహించి శ్రీ స్వామిఅమ్మవార్లకు బాషికాలను అలంకరిస్తారు.తరువాత ఈ భూమండలం మరియు శ్రీశైలక్షేత్రవర్ణనతో కూడిన మహాసంకల్పం పఠించబడుతుంది. మహాసంకల్ప పఠన తరువాత అర్చకస్వాములు మంగళాష్టకాలను పఠిస్తూ సుముహూర్త సమయంలో శ్రీ స్వామిఅమ్మవార్ల శిరస్సులపై జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని సమర్పించనున్నారు.అనంతరం లోకకల్యాణం కోసం అమ్మవారికి మాంగల్యధారణ జరిపించబడుతుంది. తరువాత శ్రీ స్వామిఅమ్మవార్లకు తలంబ్రాలను సమర్పించడం జరుగుతుంది. ఆ తరువాత శ్రీ స్వామిఅమ్మవార్ల వస్త్రాల కొంగులను కలుపుతూ బ్రహ్మముడి వేయడం బడుతుంది. చివరగా శ్రీ స్వామిఅమ్మవార్లకు పున:పూజలు జరిపి ఆశీర్వచనం, భక్తులకు ప్రసాద వితరణ చేయబడుతుంది.ఈ కార్యక్రమములో పాల్గొనే చెంచు భక్తులందరికీ కూడా ఆశీర్వచనముతో శేషవస్త్రాలను (పురుషులకు పంచ - కండువా మరియు మహిళలకు చీర రవిక వస్త్రము) అందజేయబడుతాయి.

## మహిళా ఎమ్మెల్యేతో మీడియా ముందే అనుచిత ప్రవర్తన

**- కేరళ కాంగ్రెస్ నాయకుడి తీరు వైరల్**

**తిరువనంతపురం** కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వేళ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం వేదికగా చోటుచేసుకున్న ఒక ఘటన ఇప్పుడు రాజకీయంగా పెను సంచలనం సృష్టిస్తోంది. కొల్లాం నియోజకవర్గం నుండి విజయం సాధించిన కాంగ్రెస్ మహిళా నేత బిందు కృష్ణ పట్ల సీనియర్ నాయకుడు చెరియన్ ఫిలిప్ ప్రవర్తించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది కొల్లాం ఎమ్మెల్యేగా గెలుపొందిన బిందు కృష్ణ, ఫలితాల అనంతరం పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలిపే క్రమంలో సీనియర్ నేత చెరియన్ ఫిలిప్ అత్యుత్సాహం ప్రదర్శించారు. అందరూ చూస్తుండగానే ఆమెను కౌగిలించుకునేందుకు ప్రయత్నించారు. అయితే ఆయన ప్రవర్తనతో అప్రమత్తమైన బిందు కృష్ణ, వెంటనే అసహనం వ్యక్తం చేస్తూ ఆయన చేతులను పక్కకు నెట్టివేశారు. ఒక మహిళా ప్రతినిధి అని కూడా చూడకుండా బహిరంగంగా ఆయన చేసిన ఈ పనికి అక్కడున్న వారంతా అవాక్కయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు బయటకు రావడంతో నెటిజన్లు చెరియన్ ఫిలిప్ వైఖరిపై మండిపడుతున్నారు. గెలిచిన ఉత్సాహం ఉండొచ్చు కానీ, ఒక మహిళా నాయకురాలి అనుమతి లేకుండా ఆమెతో అలా ప్రవర్తించడం సంస్కారం అనిపించుకోదు అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. బిందు కృష్ణ తక్షణమే స్పందించి అతడిని అడ్డుకున్న తీరును పలువురు మహిళా సంఘాల నేతలు అభినందిస్తున్నారు. సొంత పార్టీకి చెందిన సీనియర్ నేత కావడంతో కేరళ కాంగ్రెస్ ఇప్పుడు డిఫెన్స్‌లో పడింది. ఈ ప్రవర్తనపై పార్టీ క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీలైన సీపీఎం, బీజేపీలు కూడా ఈ అంశాన్ని అస్త్రంగా చేసుకుని కాంగ్రెస్‌పై విమర్శలు ఎక్కుపెట్టాయి. మహిళా భద్రత గురించి మాట్లాడే కాంగ్రెస్, సొంత పార్టీ మహిళా నేతలకే భద్రత కల్పించలేకపోతోందని ఎద్దేవా చేస్తున్నాయి. ఈ వివాదంపై అటు బిందు కృష్ణ గానీ, ఇటు చెరియన్ ఫిలిప్ గానీ ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది.

## ఎల్లార్తి దర్గలో ప్రత్యేక ఫాతెహాల్.



**హోళగుంద** :మండల పరిధిలో గురువారం సందర్భంగా రాష్ట్రానికి ప్రసిద్ధి గాంచిన శ్రీ శ్రీ హాజరత్ శేక్షవలి,షాషావలి తాత దర్గాలో భక్తులు ప్రత్యేక ఫాతెహాల్ నిర్వహించారు.అలాగే భక్తులు మన రాష్ట్రం నుంచి కాక కర్ణాటక, తెలంగాణ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి తాతకు ప్రత్యేక ఫాతెహాల్ నిర్వహించి అనంతరం పార్ధనలు చేసి తమ మొక్కు బడులు తీర్చుకున్నారు.

## భార్య పుట్టింట్లో బంగారు ఆభరణాల చోరీకి పాల్పడిన భర్త అరెస్ట్

- రూ.9 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం,.
- మద్యం, జూదం వంటి చెడు వ్యసనాలకు బానిసైన వ్యక్తి చోరీకి పాల్పడిన ఘటన.
- కుటుంబ కలహాల కారణంగా పుట్టింట్లో ఉంటున్న భార్య ఇంట్లో చోరీ.



**గుంటూరు** చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని వేజెండ్ల గ్రామానికి చెందిన సాతర్ల తిరుపతమ్మ తన ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి మెయిన్ డోర్ తెరిచి, ఇనుప బీరువా తాళాలు పగులగొట్టి సుమారు రూ.9,00,000/- విలువైన 72 గ్రాముల బంగారు ఆభరణాలు మరియు కొన్ని వెండి ఆభరణాలు దొంగిలించారని ఫిర్యాదు చేశారు.దీనిపై చేబ్రోలు పోలీస్ స్టేషన్ ఎస్సై వీరనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తులో భాగంగా అందిన విశ్వసనీయ సమాచారం మేరకు తెనాలి డీఎస్పీ శ్రీ జనార్ధన్ రావు గారి పర్యవేక్షణలో, పొన్నూరు రూరల్ సర్కిల్ సీఐ శ్రీ కృష్ణయ్య గారు, చేబ్రోలు ఎస్సై శ్రీ వీరనారాయణ గారు మరియు సిబ్బంది కలిసి కొత్తరెడ్డిపాలెం సెంటర్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక అనుమానిత వ్యక్తి పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించగా, వెంటనే అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో సదరు వ్యక్తి ఫిర్యాదిదారురాలి భర్త సాతర్ల గోపి (36 ) గుండవరం గ్రామ నివాసి అని తేలింది. కుటుంబ విభేదాల కారణంగా భార్యాభర్తలు విడిగా ఉంటున్నారని, భార్య తన తల్లి ఇంటి వద్ద వేజెండ్ల గ్రామంలో నివసిస్తోందని విచారణలో వెల్లడైంది.నిందితుడు మద్యం సేవించడం, పేకాట వంటి చెడు వ్యసనాలకు బానిసై డబ్బుల అవసరం ఏర్పడటంతో తన అత్తగారింట్లో చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు.

## ఏపీ నర్సింగ్ కౌన్సిల్ పేరు మార్పు

ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ కౌన్సిల్ గా ఉన్న పేరును అధికారికంగా ఆంధ్రప్రదేశ్ నర్సెస్ అండ్ మిడ్‌వైవ్స్ కౌన్సిల్ గా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది

## శిరీష ను చంపిన భర్తను ఎన్ కౌంటర్ చేయాలి



**హైదరాబాద్** జాతీయ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్కు చెందిన వడ్డెర సంఘం యూనియన్ సమక్షంలో శిరీష మృతురాలి కి న్యాయం సమకూర్చే విధంగా పోరాడుతామని శిరీషను హత్య చేసిన అంతకుడికి తన భర్తకి ఎన్కౌంటర్ చేయాలని ఇటువంటి నేరం మరెప్పటికీ చేయకుండా అందరికీ బుద్ధి వచ్చేటట్లుగా ఉండాలని ప్రతి ఒక్క ఆడపిల్ల తలెత్తుకొని రోడ్డు మీద నడిచే విధంగా ఎవరైనా భయంతో ఉండాలని ఇటువంటి నరకయాతన మరి ఏ ఆడపిల్లకు రాకూడదని శిరీష లాంటి ఆడపిల్లలకు న్యాయం జరగాలని సిఐ శివ శంకరును రాతాపూర్వకంగా కోరారు శిరీష కు న్యాయం జరిగే వరకు పోరాడుతామని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో న్యాయం జరిగే విధంగా పోరాడుతామని విలేకరులకు తెలియజేశారు

## దెందులూరులో మెగా క్రీడా సంబరాలకు శ్రీకారం

- 'చింతమనేని ప్రీమియర్ లీగ్' ద్వారా దెందులూరులో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహణ
- క్యాంపు కార్యాలయంలో అఖఒ పోస్టర్‌ను ఆవిష్కరించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్..
- క్రీడా స్ఫూర్తితో పోటీలు ఉత్సాహభరితంగా నిర్వహించాలని నిర్వాహకులకు పిలుపు..
- క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ - ప్రజా సమస్యల స్వీకరణ

**దుగ్గిరాల (క్యాంపు కార్యాలయం),** యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు మరియు వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని దెందులూరు శాసనసభ్యులు శ్రీ చింతమనేని ప్రభాకర్ గారు పేర్కొన్నారు. గురువారం దుగ్గిరాలలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 'చింతమనేని ప్రీమియర్ లీగ్' (అఖఒ)క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ గారు మాట్లాడుతూ ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇటువంటి లీగ్‌లు నిర్వహించడం శుభపరిణామన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి దెందులూరు హైస్కూల్ గ్రౌండ్లో ఈ క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ లీగ్ నిర్వాహకులు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి పెనుబోయిన మహేష్ యాదవ్ గారిని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గారు ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారులు క్రమశిక్షణతో ఆడి, క్రీడా స్ఫూర్తిని చాటాలని ఆకాంక్షించారు.ఈ టోర్నమెంట్‌లో రాష్ట్రస్థాయిలో ఏ క్రికెట్ టీంలైనా కూడా వచ్చి పాల్గొనవచ్చు అని, గెలుపొందిన జట్లకు భారీ నగదు బహుమతులతో పాటు ఆకర్షణీయమైన ట్రోఫీలను అందించనున్నట్లు వెల్లడించారు. మొదటి విజేతగా నిలిచిన జట్టుకు రూ.ఒక లక్ష 11 వేల 111 రూపాయలు బహుమతిగా అందించడం జరుగుతుందని, రెండవ జట్టు విజేతకు రూ.55,555/- , అదేవిధంగా బెస్ట్ బ్యాట్స్మెన్, బెస్ట్ బౌలర్, హ్యాట్రిక్, ఇలా అనేక అంశాల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు ప్రత్యేకంగా బహుమతి ప్రధానం కూడా చేయడం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొనాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గారు యువతకు పిలుపునిచ్చారు. టోర్నమెంట్లో పాల్గొనేవారు మరిన్ని వివరాల కోసం 6300598229, 9885509845 నంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు..అనంతరం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గారు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజల నుండి వినతులు స్వీకరించారు. విద్య, వైద్యం, మరియు మౌలిక వసతులకు సంబంధించిన పలు సమస్యలను బాధితులు ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకురాగా.. వాటిపై సానుకూలంగా స్పందించిన ఆయన, తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి పేదవాడికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దెందులూరు ఏఎంసీ చైర్పర్సన్ గారపాటి రామసీత, కూటమి నాయకులు ఇప్పిలి వెంకటేశ్వరరావు, కొనకళ్ళ శివమణి, తానంకి సురేష్ సహా పలువురు కూటమి నాయకులు, సిపిఎల్ నిర్వహక టీం సభ్యులు పాల్గొన్నారు..

## ఓటరు సవరణలో తప్పిదాలకు ఊరుకోబోము



**సికింద్రాబాద్** ప్రత్యేక ఓటరు సవరణ లో తప్పిదాలు జరిగితే ఊరుకోబోమని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. గురువారం ఆయన పద్మారావు నగర్ లోని ఎస్ఐఆర్ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమం నిర్వహణ తీరు, సిబ్బంది విధులు, ఓటరు మ్యాపింగ్ విధానం గురించి ఏఈఆర్వో ఖీూ సుజాత, సంబంధిత అధికారులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు వివరించారు. అనంతరం ఆయన మీడియా తో మాట్లాడుతూ ాఎఖీ కార్యక్రమంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని, ప్రజలు కూడా తప్పని సరిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, తమ ఓటును జాబితాలో ఉండేలా జాగ్రత్త పడాలని చెప్పారు. ాఎఖీ కార్యక్రమంలో సాంకేతికత అనుభవం కలిగిన సిబ్బందిని నియమించాలని, ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. స్వీపర్లను కూడా ాఎఖీ కార్యక్రమంలో సిబ్బందిగా నియమించినట్లు మా దృష్టికి వచ్చిందని, యాప్ ను డౌన్ లోడ్ చేయడం, వివరాలు నమోదు చేయడం వంటి విషయాలలో ఇబ్బందులు ఏర్పడతాయని అన్నారు. ఓటు షిఫ్టింగ్ కు సంబంధించి ఇంటి యజమాని వివరాలు ఇవ్వాలని చెప్పడం సరైనది కాదన్నారు. మరణించిన వారి పేరు ను ఓటరు జాబితా నుండి తొలగించాలంటే కుటుంబ సభ్యులు డెత్ సర్టిఫికెట్ తేవాలని చెప్పడం కూడా కరెక్ట్ కాదన్నారు. ఓటరు ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ప్రజలకు తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉంటారని, వారి సహకారాన్ని తీసుకోవాలని కోరారు. ప్రతిసారి ఎన్నికల సమయంలో తమ పేరు ఓటరు జాబితాలో లేదని, ఆందోళన కు గురవుతుంటారని, అలాంటి పరిస్థితులు రాకుండా నెల ఈ కార్యక్రమంలో ప్రజలు జాగ్రత్త పడాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

## పివిఎన్ఆర్ ఎక్స్ ప్రెస్ వే లో కారు బోల్తా

**రంగారెడ్డి** రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పీవీ నరసింహారావు ఎక్స్ప్రెస్ వే పైన పిల్లర్ నెంబర్ 148వద్ద ఆరంఘర్ నుండి మెహిదీపట్నం వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్ ను ఢీ కొట్టి నడిరోడ్డుపై పల్టీ కొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఐదు మంది యువకులు ఉన్నారు. వాహనదారుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు ప్రమాదానికి గురైన కారును ఫ్లైఓవర్ పై నుండి కిందికి దించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

తెలంగాణ వాణి



# గిరిజన గర్భిణీ స్త్రీలకు ఉచిత వైద్య శిబిరము



**ఆత్మకూరు** ఆత్మకూరు సామాజిక వైద్య కేంద్రంలో గురువారము గిరిజన గర్భిణీ స్త్రీల ప్రత్యేక వైద్య శిబిరాన్ని డాక్టర్ రాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరానికి పరిసర గిరిజన గూడేముల నుంచి పలువురు గర్భిణీ స్త్రీలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాయుడు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు గర్భధారణ సమయంలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. తల్లి మరియు శిశువు ఆరోగ్యంగా ఉండేందుకు సమతుల్య ఆహారం తీసుకోవడం, ఐరన్ మరియు కాల్షియం మాత్రలను వైద్యుల సూచనల మేరకు వినియోగించడం అవసరమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను గిరిజన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భధారణ సమయంలో ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. ఈ శిబిరంలో వైద్య సిబ్బంది గర్భిణీ స్త్రీలకు రక్తపోటు, హీమోగ్లోబిన్ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమములో హెడ్ నర్స్ చెంచులక్ష్మి స్టాఫ్ నర్స్ గీత కుమారి ఎస్ ఎస్ కే మేనేజర్ ఇస్మాయిల్ జబివుల్ల ఆర్ డి టి స్వచ్ఛంద సేవ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

**- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



**వరంగల్** బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ గురువారం వెస్ట్ జోన్ పరిధిలోని చిల్పూర్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ ఉదయం చిల్పూర్ పోలీస్ స్టేషన్ కు పోలీస్ అధికారులు పోలీస్ కమిషనర్ కు మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ రిసెప్షన్, ఐటీ సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పనితీరును సీపీ సిబ్బందిని పని తీరును అడిగి తెలుసుకోవడంతో పాటు స్టేషన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులతో పాటు, రౌడీ షీటర్లు, అనుమానితుల రికార్డులు, ప్రస్తుతం పెండింగ్ కేసుల రికార్డ్ లకు సీపీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ స్టేషన్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుకున్నారు. చివరగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి కానిస్టేబుల్ గ్రామాలను సందర్శించి శాంతి భద్రతలకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, ప్రతి గ్రామస్తుడు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా ట్రాఫిక్ రూల్స్ పై అవగహనా కల్పించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకై ముందస్తు చర్యలు తీసుకోవాలని,అక్రమ ఇసుక రవాణా, పాఠశాలల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీస్ కమిషనర్ అధికారులు, సిబ్బందికి తెలిపారు. ఈ తనిఖీల్లో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ భీం శర్మ, సిఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్.ఐ నవీన్ కుమార్ వున్నారు.

## మే 9న బద్వేల్‌లో ఉచిత

# మెగా కంటి వైద్య శిబిరం

**బద్వేలు** బద్వేలు లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మే 9వ తేదీ ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బద్వేలు సుమిత్రానగర్ కు చెందిన ఉపాధ్యాయుడు వీరదాసరి జేకబ్ సెల్వరాజ్ తెలియజేశారు.నెల్లూరు పట్టణం బృందావనం కు చెందిన సుశీల నేత్రాలయ వారిచే 9వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్.పి.సుధాకర్ రాజు, డాక్టర్.వి.జవహర్ సత్య బాబు, డాక్టర్.మేఘన లు పాల్గొని ప్రజలకు ఉచిత కంటి వైద్య సంబంధిత పరీక్షలు నిర్వహిస్తారన్నారు. గ్లాకోమా, శుక్లం, రెటీనా తదితర కంటి వ్యాధులకు పరీక్షలు చేసి తగిన వైద్య సలహాలు అందిస్తారన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ, క్యాస్ లెస్ (ఈహెచ్ఎస్) ద్వారా నెల్లూరులోని సుశీల నేత్రాలయ ఆసుపత్రి నందు ఉచితంగా ఆపరేషన్లు కూడా నిర్వహిస్తారన్నారు.

ఆపరేషన్ అవసరమైన వారిని క్యాంపు రోజునే ఆసుపత్రికి తీసుకువెళ్లే ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు కూడా పంపిణీ చేస్తారన్నారు. ఈ కంటి పరీక్షలకు హాజరయ్యేవారు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ మరియు ఈహెచ్ఎస్ కార్డులను తీసుకొని రావాలన్నారు. బద్వేల్ లో జరిగే ఈ అవకాశాన్ని ప్రజలు, ఉద్యోగ, ఉపాధ్యాయులు పెన్షనర్లు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలి

**రాయచోటి** స్కూల్ బస్సులు తప్పనిసరిగా భద్రత నియమాలు పాటించాలని రాయచోటి అజయ్ కుమార్ హెచ్చరించారు గురువారం అన్నమయ్య జిల్లాలోని రాయచోటి సుండుపల్లి మార్గాలలో తిరుగుతున్న పాఠశాలల బస్సులను వాటి కండిషన్లను పరిశీలించారు ఈ సందర్భంగా ఎం వి ఐ మాట్లాడుతూ60 ఏళ్లలోపు వయసుతోపాటు ఐదు సంవత్సరాలు అనుభవంతో కూడిన హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారే స్కూల్ బస్సులు డ్రైవింగ్ చేయాలి..విద్యార్థులు సురక్షితంగా ప్రయాణించడానికి మోటార్ అధికారులు అన్ని రకాల చర్యలు చేపడుతున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రాన్స్పోర్ట్ కమిషనర్, అన్నమయ్య జిల్లా రవాణా శాఖ అధికారి ఆదేశాల మేరకు సుండుపల్లి మండలంలో స్కూల్ బస్సులు తనిఖీలు వాటి కావలసిన భద్రత నియమాలపై అవగాహన కల్పించారు పలు భద్రతా నియమాలు వాహన చోదకులకు పాఠశాలల యాజమాన్యాలకు మీడియా ద్వారా ఎం వి ఐ అజయ్ కుమార్ వెల్లడించారు. ఈ ఏడాది స్కూల్లో ప్రారంభమయ్యే లోపల స్కూల్ బస్సులు అన్ని రకాల భద్రత నియమాలు పాటించాలని ప్రవేట్ స్కూల్ కాలేజ్ యాజమాన్యాలకు సూచించారు రాయచోటి ఎం.వి.ఐ అజయ్ కుమార్.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రాన్స్పోర్ట్ కమిషనర్, అన్నమయ్య జిల్లా రవాణా శాఖ అధికారి ఆదేశాల మేరకు సుండుపల్లి మండలంలోని పలు పాఠశాల కాలేజ్ బస్సుల భద్రత నియమాలను పరిశీలించినట్లు అజయ్ మీడియా ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా మోటారు వాహనాల చట్టాలను ప్రతి పాఠశాల యాజమాన్యాలు పాటించాలని వారికి సూచించారు. 32 రకాల భద్రత నియమాల గురించి వారికి అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. సుండుపల్లి మండలంలో సుమారు 22 పైగా కాలేజ్, స్కూల్ బస్సులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ ఏడాది స్కూల్స్,కాలేజీలు ప్రారంభమయ్యే లోపల బస్సులకు అన్ని రకాల భద్రత నియమాలు ఉండేటట్లు చూసుకోవాలని తెలియజేసామన్నారు. భద్రత నియమాలు పాటించని స్కూల్ యాజమాన్యాలపై కఠినమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచడం జరుగుతుందన్నారు. ఇటీవల కాలంలో స్కూల్ బస్సులు అనేక ప్రమాదాలకు గురవుతున్న పరిస్థితులు మనం చూస్తూనే ఉన్నామన్నారు. అటువంటి సమస్యలు లేకుండా విద్యార్థులు సురక్షితంగా ప్రయాణించేందుకు ట్రాన్స్పర్ అధికారులు కఠినమైనటువంటి చర్యలు అమలు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. స్కూల్ యాజమాన్యాలు డ్రైవర్ తో పాటు అటెండర్ కూడా తప్పకుండా నియమించుకోవాలన్నారు. అన్ని రకాల రికార్డులు తప్పనిసరిగా బస్సులో పెట్టుకొని ఎక్కడైనా పోలీసు రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించినప్పుడు వారికి చూపించాల్సిన బాధ్యత ఉందన్నారు.

## అతి చిన్న వయస్సులోనే అపరజ్ఞానిగా

# వరల్డ్ రికార్డ్స్‌లోకి రెండున్నర ఏళ్ల మౌర్య

### - మౌర్యను తీర్చిదిద్దిన తల్లి రాణీని అభినందించిన ఎమ్మెల్యే మద్దిపాటి

**నల్లజర్ల** :పలక కూడా పట్టని వయసులోనే రెండున్నరేళ్ల బాలుడు మౌర్య అపారమైన జ్ఞానాన్ని ప్రదర్శిస్తూ వరల్డ్ రికార్డ్స్ సృష్టిస్తున్నాడు. నల్లజర్ల మండలం ఘంటావారిగూడెం కు చెందిన వీరబత్తిన మౌర్య రెండున్నరేళ్ల వయసులోనే మూడు సార్లు వరల్డ్ రికార్డ్స్ లోకి ఎక్కాడంటే ఒక్కసారి ఆ చిన్నోడి ప్రతిభ ఏంటో అర్థమవుతుంది. ఆవపాడు సచివాలయ ఏ.ఎన్.ఎం గా పనిచేస్తున్న రాణి తన కొడుకును అందరిలా కాకుండా విభిన్నంగా పెంచాలని వినూత్నంగా ఆలోచించింది. అదే చిన్నోడు మౌర్యను వరల్డ్ రికార్డ్స్ లో దూసుకెళ్లేలా చేసింది. కేవలం 50 సెకన్ల సమయంలోనే విశాల భారతదేశ మ్యాప్ లో వున్నా 24 రాష్ట్రాలను గుర్తించినందుకు మౌర్య కు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధించాడు. ఇదే కాకుండా గతంలో కేవలం ఐదో నెల చిరుప్రాయంలో అదికూడా అన్న ప్రాసన కాకముందే జంతువుల బొమ్మలను, పక్షులను, పండ్లు, పువ్వులను, జాతినేతలను, జాతీయ పతాకాలను... ఇలా ఒకటేమిటి దాదాపు వందల్లో బొమ్మల కార్డులను అతికొద్ది సమయంలో గుర్తించి నోబుల్ వరల్డ్ రికార్డ్ ను మౌర్య అందుకున్నాడు.

**ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రపంచ రికార్డ్ అందుకున్న మౌర్య!**

చిన్నతనంలోనే అద్భుత ప్రతిభను కనబర్చి రికార్డ్ సాధించిన మౌర్య తనకు వచ్చిన నోబుల్ ప్రపంచ రికార్డ్ ను గురువారం గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు చేతుల మీదుగా అందుకున్నాడు. చిన్నారి మౌర్య లో దాగివున్న ప్రతిభను గుర్తించి అందుకు తగ్గట్టు తయారు చేసిన తల్లి రాణీని ఎమ్మెల్యే మద్దిపాటి ప్రత్యేకించి అభినందించారు. చిన్నారి మౌర్యను మనసారా హత్తుకుని మరెన్నో ఘనవిజయాలు సాధించాలని ఎమ్మెల్యే తమ దివ్య ఆశీస్సులు అందించారు.



**మౌర్య తల్లి రాణీకి అభినందనలతో పాటు ఐదు సెంట్లు స్థలం!**

అతి చిన్న వయసులోనే అపరజ్ఞానిగా ప్రపంచరికార్డ్ లను సాధిస్తున్న మౌర్య ను తయారుచేసిన తల్లి రాణీకి ప్రభుత్వం తరపున ఐదు సెంట్లు స్థలాన్ని ఇస్తున్నట్టు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ప్రకటించారు. పిల్లల జ్ఞానాన్ని పసిగట్టి అందుకు అనుగుణంగా వారిని ఉన్నత స్థాయిలో ప్రయోజకులుగా తీర్చిదిద్దడంలో తల్లిగా రాణీ చేసిన కృషిని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.

తన కుమారుడు మౌర్య సాధిస్తున్న ఘనతను గుర్తించి గౌరవించిన ఎమ్మెల్యే కు రాణీ కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు జీ.వీ.వీ.ప్రసాద్, సమాజసేవకులు మల్లిపూడి రాజారావు పాల్గొన్నారు.

# బాల్యాని చిదిమేస్తున్నతలసేమియా

**- నేడు ప్రపంచ తలసేమియా దినోత్సవనీ**

లీటర్ల కొద్ది రక్తం తాగే వ్యాధి అది.. బాల్యాని చిదిమేస్తూ, నేడు ప్రపంచాన్ని వనికిస్తుంది. నయం చేసేందుకు ఇప్పటివరకు మందులు లేకపోగా... ప్రతి 20 రోజులకు ఒకసారి చొప్పున జీవితాంతం రక్తం ఎక్కించాల్సిన భయంకరమైన వ్యాధి తలసేమియా. నేడు ప్రపంచ తలసేమియా దినోత్సవ సందర్భంగా కొడంగల్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లిల్లీ మేరి తో ప్రత్యేక కథనం :సముద్రానికి వచ్చే రక్తహీనత: ఈ వ్యాధి బాధిత చిన్నారులకు ప్రతి 20 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. సకాలంలో రక్తం ఎక్కించకుంటే ప్రాణాలకు ముప్పు తప్పదు. గ్రీకు భాషలో తలసా అంటే సముద్రము, హీమ అంటే రక్తము. ఈ రెండు కలిపి తలసేమియా లేదా తలసీమియా అంటారు. సముద్రానికి వచ్చే రక్తహీనత దీని అర్థము. మొదటగా గ్రీసు, ఇటలీ, మధ్యధరా సముద్రంలో ఉండే కొన్ని దేశాలలో ఈ వ్యాధిని గుర్తించారు. కాలక్రమేనా ఆసియాలోని అనేక దేశాలలో ఈ వ్యాధి ప్రబలుతుంది. బిడ్డ పుట్టుకతోనే వచ్చే వ్యాధి. దీని నివారణకు ఇప్పటి వరకు మందులు కనిపెట్టలేదు. కేవలం ప్రతి రెండు మూడు వారాలకోసారి వ్యాధిగ్రస్తులకు రక్తం ఎక్కించడం ఒకటే మార్గం. దీంతో రెడ్ క్రాస్ సొసైటీ, తలసేమియా సొసైటీలు వ్యాధిగ్రస్తులకు ఎప్పటికప్పుడు శుద్ధి చేసిన రక్తం అందించేందుకు తమ వంతు తోడ్పాటును అందిస్తున్నాయి. బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటం వైద్య రంగాన్ని మరింత వణికిస్తుంది. అంతేకాకుండా వ్యాధి మొదటి దశలో గుర్తించడం కష్టమే. సకాలంలో రక్తం లభించక వ్యాధి బాధితుల కుటుంబ సభ్యులు పడరాని పాట్లు పడుతున్నారు. దాతల కోసం ప్రసారమాధ్యమాల్లో ప్రకటనలు సైతం ఇస్తున్నారు అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల **ప్రిన్సిపల్ డాక్టర్ లిల్లీ మేరి పేర్కొన్నారు. :తల సేమియా అంటే:** తలసేమియా రెండు రకాలు. ఒకటి తలసేమియా మైనర్, రెండోది తలసేమియా మేజర్. మైనర్ అంటే కొంతమేరకు రక్తహీనత తప్ప మరో ఇబ్బంది ఉండదు. తలసేమియా మేజర్ ప్రాణాంతకమని చెప్పవచ్చు. వీరికి ప్రతి రెండు మూడు వారాలకోసారి రక్తం ఎక్కించాల్సిందే. లేని ఎడల వారు ప్రాణాలు కోల్పోతారు. తలసేమియా మైనర్ బాధిత దంపతులకు జన్మించే పిల్లల్లో 25% తలసేమియా మేజర్ వ్యాధిగ్రస్తులు అయ్యే అవకాశం ఉన్నట్లు అనేక సర్వేలు చెబుతున్నాయి. సాధారణ మనుషుల్లో ఏర్పడే రక్త కణాలు ఒక్కొక్కటి 120 రోజుల వరకు బ్రతికి ఉంటాయి. తలసేమియా మేజర్తో బాధపడే వారిలో రక్త కణాలు 21 రోజులకే చనిపోతాయి. ఇదే వారిలోని ప్రధాన సమస్య. ఈ సమస్యను అధిగమించేందుకు వారికి రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. తలసేమియా మేజర్ బాధిత ఆరువారాల నుండి 12 నెలల్లో పిల్లలు పాలిపోయినట్లుగా ఉండటం, అలసటగా కనిపించటం, ప్లీహం పెరగటం ఈ వ్యాధి లక్షణాలు. తలసేమియా వ్యాధి గల పిల్లలు ఎక్కువగా ఏడవటం, తరచుగా వాంతులు, విరోచనాలు, జ్వరంతో బాధపడుతుంటారు. ఈ పరిస్థితుల్లో వారికి రక్త పరీక్షలు చేయించాలి. వ్యాధి ఉన్నట్లు తేలితే వారికి ప్రతి మూడు వారాలకోసారి హిమోగ్లోబిన్ 10 గ్రాములకు పైగా ఉండే ఎర్ర రక్త కణాలు ఎక్కించాలి. నిరంతరం ఎర్ర రక్త కణాలు ఎక్కించడం ద్వారా వ్యాధిగ్రస్తులు శరీరంలో ఐరన్ నిల్వలు పెరుగుతాయి. 20 సార్లు ఎర్ర రక్త కణాలు ఎక్కించిన తర్వాత శరీరంలో అధికంగా చేరినటువంటి ఐరన్ నిల్వలను తగ్గించేందుకు ఐరన్ చిలేషన్ థెరపీ చేయించాల్సి ఉంటుంది. వీరికి తరచుగా హెపటైటిస్ బి, సి, హెచ్ ఐ వి స్క్రీనింగ్, పెరిటివ్ లెవెల్, సీరం ,కాల్షియం, ఫాస్ఫరస్ పరీక్షలు చేయిస్తుండాలి. అలాగే డెంటల్ చెక్ అప్, కార్డియాక్ చెకప్, ఎండోక్రిన్ ఫంక్షన్ టెస్టులు కూడా చేయించాల్సి ఉంటుంది అని ప్రొఫెసర్ లిల్లీ మేరి తెలిపారు: **:బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ తో నయం:** తలసేమియా బాధిత రక్తం గ్రూపు ఉన్నటువంటి దాతలు లభిస్తే బోన్ మ్యారో (ఎముక మజ్జ) ట్రాన్స్ ప్లాంటేషన్ తో ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. ఈ సర్జరీకి లక్షల్లో ఖర్చవుతుంది. కొన్ని కార్పొరేట్ సంస్థలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (ఊఖీ) కింద దేశవ్యాప్తంగా బోన్ మ్యారో (ఎముక మజ్జ) ట్రాన్స్ ప్లాంటేషన్ మార్పిడి ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహిస్తున్నాయి. : **పెరుగుతున్న బాధితులు:** ప్రతి ఏడాది తలసేమియా వ్యాధి బాధితుల సంఖ్య పెరుగుతుంది. ప్రపంచ జనాభాలో సుమారు 5శాతం మంది తలసేమియా బాదిన పడుతున్నారు. తలసీమియా తో దేశవ్యాప్తంగా 15 లక్షల మంది చిన్నారులు ఇబ్బంది పడుతున్నారని, దేశంలో ప్రతి ఏటా 10 నుంచి 12 వేల మంది చిన్నారులు ఈ వ్యాధితో జన్మిస్తున్నారు. ఇక తెలంగాణాలో సుమారు 2000 బాధితులు తమ పేర్లను వివిధ జిల్లాలలోని తలసేమియా సెంటర్ల యందు నమోదు చేసుకున్నట్లు సర్వే లెక్కలు చెబుతున్నాయి. తెలంగాణలోని రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రాలలో తలసేమియా సెంటర్ లను నిర్వహిస్తున్నాయి. వ్యాధిపై అవగాహన లేకపోవడంతో పేదలు తమ పిల్లలకు వైద్యం చేయించలేకపోతున్నారు.::

**రక్త సేకరణలో సొసైటీలు:** రెడ్ క్రాస్ సొసైటీ అటు తలసేమియా సొసైటీలు ప్రత్యేకంగా తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తం సకాలంలో అందించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఎప్పటికప్పుడు ఎంత మేరకు రక్తం అవసరం అనేది గుర్తించి రక్తదాతల నుండి రక్తమును సేకరిస్తున్నాయి. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాయి. ::నిరంతర రక్త దానము::వ్యాధి బారిన పడిన తమ పిల్లలకు పేదలు రక్తం కొనుగోలు చేయలేని పరిస్థితి. వీరి కోసం రెడ్ క్రాస్ సొసైటీ, అటు తలసేమియా సొసైటీలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శిబిరాల ద్వారా రక్తాన్ని సేకరించి వారికి అందిస్తున్నాయి. ప్రథమ ప్రాధాన్యతగా తమ పరిధిలోని తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఎన్ని యూనిట్లు రక్తం అవసరం అనేది గుర్తించి ఎప్పటికప్పుడు ఉచితంగా అందజేస్తున్నారు. ఇందుకుగాను ఈ రెండు సంస్థలు తమ బ్లడ్ బ్యాంకుల్లో ఎప్పటికప్పుడు రక్తం నిల్వలు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

తల సేమియా వ్యాధితో బాధపడుతున్న వారందరికీ హైదరాబాదులోని రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రము, హనుమకొండ, మంచిర్యాల, నిజామాబాద్, కరీంనగర్, కొత్తగూడెం, ఖమ్మం, మరియు మహబూబ్నగర్ రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రాలలోనూ మరియు తల సేమియా సొసైటీ రక్తనిధి లోనే రక్తం ఎక్కిస్తున్నారు. ::

**అవగాహనతోనే నివారణ:** ప్రొఫెసర్ లిల్లీ మేరి ఈ వ్యాధిని అరికట్టేందుకు ప్రజలు దీనిపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలి. పుట్టే పిల్లలు తల సేమియా వ్యాధి బారిన పడకుండా కాపాడాలంటే పెళ్లికి ముందు యువతి యువకులు హెచ్బిఏ 2 లెవెల్ టెస్టులు చేయించుకోవాల్సి ఉంటుంది. భార్యాభర్తలు ఇరువురు జన్యు లోపంతో ఉంటే వారికి తల సేమియా వ్యాధితో పిల్లలు పుట్టే అవకాశం ఉంది. భార్యాభర్తల్లో ఒకరు జన్యు లోపాలతో ఉన్న సాధారణ వ్యక్తులను పెళ్లాడితే పిల్లలలో ఈ వ్యాధి రాకుండా అరికట్టవచ్చు. ఈ వ్యాధిని అరికట్టేందుకు రక్తపరీక్షలు చేయించుకోవాలి అని ప్రొఫెసర్ లిల్లీ మేరి తెలిపారు.

## పాఠశాల కోసం పురాతన

# ఆలయం కూల్చివేత



**వరంగల్** సమీకృత పాఠశాల నిర్మాణం కోసం 800 ఏళ్ల పురాతన శివాలయన్ని అధికారులు కూల్చివేసారు. వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం అశోక్ నగర్ ప్రాంతంలో 800 ఏళ్ల క్రితం కాకతీయ రాజు గణపతి దేవుడి కాలంలో నిర్మించిన శివాలయం కూల్చివేసారు. రాష్ట్ర పురావస్తు శాఖ పరిధిలో ఉన్న శివాలయాన్ని సమీకృత పాఠశాల నిర్మాణం కోసం బుల్డోజర్తో కూల్చడం అన్యాయం. ఇది తెలంగాణ చరిత్రకు మచ్చ అని తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ మండిపడ్డారు.

# ధర్మవరంలో ఏటీఎం చోరీ..

**- రాప్తాడు వద్ద మెషీన్ పడేసిన దుండగులు**

**ధర్మవరం** మంగళవారం రాత్రి ఏకంగా ఏటీఎం మెషిన్ ను దొంగిలించిన దుండగులు చివరకు మెషిన్ నె రాప్తాడు దగ్గర పడేసారు. అందులోనుంచి రూ.10 లక్షల నగదు అపహరించారు. డబ్బు తీసుకుని రాప్తాడు మండలం హంపాపురం వద్ద ఏటీఎం ను పడేసారు. ధర్మవరం పట్టణంలోని ఐడీఎఫ్ సీ బ్యాంకు ఏటీఎం ను బోలేరోతో లాగి దొంగిలించారు. పోలీసులు దొంగల కోసం గాలిస్తున్నారు.

# బహిరంగ చర్చకు సిద్ధమా..?

**- ఎమ్మెల్యేకు కార్యకర్త సవాల్**



**గార్లదిన్నె** శింగనమల టీడీపీ ఎమ్మెల్యే బండారు శ్రావణిపై కార్యకర్త తిరుగుబాటు చేసాడు. టీడీపీ ఎమ్మెల్యే బండారు శ్రావణి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించాడు. డబ్బుకు కక్కుర్తిపడి టీడీపీ నేతలు, కార్యకర్తలను స్వయంగా ఎమ్మెల్యే అణచివేస్తున్నారని ఆవేదనతో సెల్ఫీ వీడియో విడుదల చేసాడు. గార్లదిన్నె మండలం కనుంపల్లి గ్రారోపించాడు. మానికి చెందిన దళిత టీడీపీ కార్యకర్త ప్రసాద్ ఎమ్మెల్యే బహిరంగ చర్చకు వస్తే అన్ని అరాచకాలు బయటపెడుతానని స్పష్టం చేసాడు. సదరు వీడియో సోషల్ మీడియా లో వైరల్ గా మారింది. టీడీపీ కార్యకర్త ప్రసాద్ వీడియో ఇటీవల కనుంపల్లి గ్రామంలో పర్యటించిన టీడీపీ ఎమ్మెల్యే బండారు శ్రావణి ప్రశ్నించేందుకు వెళ్లినప్పు పోలీసులు ఈడ్చుకెళ్లారు.

RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
The Voice of Telangana
శుక్రవారం, మే 8, 2026

### కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై

# బిజెపి కార్యకర్తల దాడి అమానుషం

**- దాడి చేసిన దుండగులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.**

**- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్**

**హుస్నాబాద్** కరీంనగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై అక్కడి బిజెపి కార్యకర్తలు దాడికి పాల్పడడం అమానుషమైన చర్య అని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై డ్రగ్స్ అంటూ అనేక ఆరోపణలు చేస్తున్న బిజెపి, కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలను ఖండిస్తూ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను అపార్థం చేసుకొని దాడికి పాల్పడ్డారని అన్నారు.

కార్యాలయం పై దాడి చేయడంతో పాటు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వాహనాన్ని ధ్వంసం చేశారన్నారు. బిజెపి నాయకులు, కార్యకర్తలు ఇలాంటి చర్యలకు పాల్పడడం వారి నియంతృత్వ ధోరణికి నిదర్శనం అన్నారు. ఏమైనా ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలి తప్ప ఇలాంటి భౌతిక దాడులకు పాల్పడడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు అన్నారు. క్యాంపు కార్యాలయం పై దాడి చేయడంతో పాటు ఎమ్మెల్యే వాహనాన్ని ధ్వంసం చేసిన దుండగులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు బిజెపి పార్టీకి తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

### 1745 పాలసీలతో కడప డివిజన్లో నే

# ప్రథమ స్థానం..



**ఆళ్లగడ్డ** నంద్యాల బ్రాంచ్ లో గడిచిన ఆర్థిక సంవత్సరంలో 1745 జీవిత బీమా పాలసీలను సేకరించి ప్రథమ స్థానంలో నిలిచిన సీనియర్ డెవలప్మెంట్ ఆఫీసర్ దేవా ను గురువారం బ్రాంచ్ అధికారులు ఘనంగా సత్కరించారు. ఆళ్లగడ్డలోని జీవిత బీమా శాటిలైట్ కార్యాలయంలో జరిగిన నంద్యాల, ఆళ్లగడ్డ అభివృద్ధి అధికారుల సమావేశంలో నంద్యాల బ్రాంచ్ మేనేజర్ శివ శంకర్ కుమార్, ఆళ్లగడ్డ బీ. ఏం శ్రీనివాసులు మాట్లాడుతూ.. కృషి పట్టుదల ఉంటే దేనినైనా సాధించవచ్చని కొనియాడారు. ఈ ఏడాది కూడా అభివృద్ధి అధికారులు అందరూ సమిష్టిగా కృషిచేసి బ్రాంచికి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించి బీమా పాలసీలను సేకరించాలని మేనేజర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మేనేజర్(ఏజెన్సీ )సుబ్బ నరసింహ అభివృద్ధి అధికారులు దేవా, విజయభాస్కర్, మధుమోహన్ రెడ్డి, శ్రీరాములు, సాయి ఈశ్వర్ రెడ్డి, విజయ శేఖర్, కేశవరెడ్డి, వెంకటరమణ, శశికళ, జగదీష్ కుమార్, కుప్పల శివ శంకర్, నాగార్జున, రాజశేఖర్, కుమ్మరి శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రాతిదూలం పోటీలను ప్రారంభించిన టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి



**కొలిమిగుండ్ల** లిమిగుండ్ల మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ నందు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు సీనియర్ వృషభాలకు రాతిదూలం పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను కొలిమిగుండ్ల మండల టిడిపి అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి రైతులు రైతు సంఘం నాయకులతో కలిసి గురువారం నాడు ఘనంగా ప్రారంభించారు. అనంతరం రైతు సంబరాల సందర్భంగా మొదటి కాడి రైతును రైతు సంఘం నాయకులు మూలే రామేశ్వర్ రెడ్డి, మూలే హుస్సేన్ రెడ్డి, గూలి నాగేశ్వర్ రెడ్డి, గూలి రామచంద్రారెడ్డి, కలిసి రైతును ఘనంగా సన్మానించారు. రాతిదూలం పోటీలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుండి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాంకో సిమెంట్ యాజమాన్యం వారి ఆధ్వర్యంలో ఇవాళ ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మూలే రామేశ్వర్ రెడ్డి, నంద్యాల రామేశ్వర్ రెడ్డి, వి ఆర్ లక్ష్మిరెడ్డి, గొంగటి హుసేన్ రెడ్డి, గొంగటి నారాయణరెడ్డి, సత్యం రెడ్డి, అంబటి వివేక్ రెడ్డి, ఇటిక్యాల తోట శివారెడ్డి, తోట అమర్నాథరెడ్డి, కళ్యాణ్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, కృష్ణ రంగారెడ్డి, లోకనాథరెడ్డి, నిమ్మకాయల దస్తగిరి, రంగయ్య, ఎర్రగుడి రాజగోపాల్, కోటపాడు శివరామిరెడ్డి, కోటపాడు శివారెడ్డి, లోకేపల్లె మధు ప్రసాద్ రెడ్డి, పెద్ద వెంతుర్ల చెన్నారెడ్డి, కమ్మవారిపల్లె వెంకటేశ్వరరావు, పుల్లారెడ్డి, మందా విజయ్, రవికుమార్, బొట్టు స్వామి, వేణు యాదవ్, బెలుము సత్యనారాయణ రెడ్డి, పల్లె వెంకటేశ్వర్ రెడ్డి, వెన్నపూస రామచంద్రారెడ్డి, సురేష్ నాయుడు, వెంకటేష్, ఇంకా తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### కొండగట్టులో హనుమాన్ పెద్ద జయంతి

# వేడుకలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**- అదనపు ఎస్పీ చేతన్ నితిన్**




**జగిత్యాల** కొండగట్టులో ఈ నెల 10 నుండి 13 వరకు నిర్వహించనున్న హనుమాన్ పెద్ద జయంతి మహోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా అదనపు ఎస్పీ చేతన్ నితిన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జయంతి వేడుకల సందర్భంగా వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆలయ పరిసర ప్రాంతాలు, క్యూలైన్లు, మాలవిరమణ ప్రాంతాలు, పార్కింగ్ ప్రదేశాలు, వాహనాల రాకపోకలు జరిగే మార్గాలు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని పేర్కొన్నారు. ఎలాంటి నేరాలకు తావులేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ భద్రతా ఏర్పాట్ల పరిశీలనలో అదనపు ఎస్పీ తో పాటు డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, ఎస్ బి ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, సీఐలు రవి, సుధకర్,కరుణాకర్, ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.

# మామిడి రైతుల ఆవేదనను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

**- మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి - నునుసురాళ్ల గ్రామంలో మామిడి తోటలు పరిశీలన.**





**తుగ్గలి:** మామిడి రైతుల ఆవేదనను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలియజేశారు. గురువారం రోజున తుగ్గలి మండల పరిధిలోని గల నునుసురాళ్ల గ్రామం నందు మండల వైసీపీ నాయకుల, గ్రామ రైతుల ఆధ్వర్యంలో మామిడి తోటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి తోట పైన ఆధారపడి జీవిస్తున్న రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె తెలియజేశారు. అకాల వర్షాలకు, గాలులకు చాలావరకు మామిడి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆమె తెలియజేశారు. మామిడి పంట సాగుకు ఎకరాకు ఒక లక్ష పెట్టుబడి వస్తుందని,మామిడి పంటకు సరైన ధర లేక మామిడి రైతులు అప్పుల పాలవుతున్నారని తెలియజేశారు.

కూటమి ప్రభుత్వం తక్షణమే మామిడి రైతులను ఆదుకొని,ఒక బాక్స్ 2000 రూపాయలు చొప్పున మద్దతు ధర ప్రకటించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు మామిడి పంటను ఎగుమతులు చేయడం ద్వారా మామిడి పంటకు మంచి ధర వస్తుందని ఆమె తెలియజేశారు. ఈ ప్రభుత్వాలు మామిడి పంట ఎగుమతులను పూర్తిగా నిలిపివేయడంతో మామిడి పంట ధర పూర్తిగా పతనమైందని ఆమె తెలియజేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రైతులకు ఏ పథకాలు సరిగ్గా అందడం లేదని ఆమె తెలియజేశారు. రైతులకు గిట్టుబాటు ధర,ఇన్సూరెన్స్ వంటివి రైతులకు అందరిని ద్రాక్షలాగా ఉన్నాయన్నారు.

అదేవిధంగా మొక్కజొన్న రైతులకు కూడా సరైన మద్దతు ధర లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆమె తెలియజేశారు. కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి చాలా ఘోరంగా ఉందని ఆమె తెలియజేశారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో మరియు వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రైతే రాజుగా వ్యవసాయానికి పెద్దపీట వేశారని ఆమె తెలియజేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకొని గిట్టుబాటు ధర కల్పించాలని ఆమె తెలియజేశారు. లేనిపక్షంలో మామిడి రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్, మండల అధ్యక్షుడు గోపాల్ రెడ్డి,వైసిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి,గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రా రెడ్డి,మాజీ జడ్పిటిసి పగిడిరాయి జగన్నాథరెడ్డి, మేధావుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి రాతన మోహన్ రెడ్డి, నునుసురాళ్ల మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి,రంగారెడ్డి,శ్రీనివాసరెడ్డి,ప్రతాపరెడ్డి, రమణారెడ్డి,శభాష్ పురం రాఘవరెడ్డి, ముక్కెళ్ల లక్ష్మణస్వామి,నునుసురాళ్ల గ్రామ రైతులు,మామిడి రైతులు,

# 10న మెగా మెడికల్ క్యాంప్

**- ఉచితంగా వైద్య పరీక్షలు, ఉచితంగా మందుల అందజేత**

**- హాజరుకాబోతున్న దాదాపు 25మంది స్పెషలిస్ట్ వైద్యులు**

**- అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు**

**- రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల కోసం ఈ శిబిరం**

**- ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీ భరత్ విజ్ఞప్తి**

**రాజమహేంద్రవరం, మే 7:** ఈనెల 10వ తేదీ ఆదివారం రోజున స్థానిక కృష్ణ నగర కొత్తరోడ్డులోని వివి గార్డెన్స్‌లో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. ఇందుకు సంబందించిన పోస్టర్ ని ఆయన ఆవిష్కరించారు. కాంటినెంటల్ హాస్పిటల్స్ , నుంచి అన్ని డిపార్ట్‌మెంట్స్‌కి సంబంధించి వైద్యులు అలాగే వాసన్ ఐ కేర్ హాస్పిటల్స్ కి సంబంధించిన డాక్టర్లు అలాగే అలాగే జిఎస్ఎల్ మెడికల్ కాలేజ్ వైద్య నిపుణులు కూడా రాబోతున్నారని ఆయన తెలిపారు. మొత్తంమీద దాదాపు 25మంది స్పెషలిస్ట్ డాక్టర్లు ఈ శిబిరంలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని రాజమండ్రి ప్రజలే కాకుండా గోదావరి జిల్లా ప్రజలందరూ కూడా ఉపయోగించుకోవాలని కోరారు. సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్లు ఈ శిబిరానికి హాజరవుతున్నందున వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు కూడా ఇవ్వబోతున్నామని మాజీ ఎంపీ భరత్ తెలిపారు. క్యాన్సర్, హార్ట్ ,కిడ్నీస్ , ఊపిరితిత్తులు, కీళ్ల నొప్పులు, న్యూరో, డెంటల్, గైనకాలజి తదితర విభాగాలకు సంబంధించిన నిపుణులు వస్తున్నందున ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకుంటారని ఆశిస్తున్నట్లు భరత్ తెలిపారు. కంటి పరీక్షల తర్వాత అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు కూడా చేయబోతున్నామని ఆయన తెలిపారు. పేదలకు ఉచితంగా ఆపరేషన్లు చేయించే ఆలోచన ఉందన్నారు. ఆరోగ్యశ్రీ పని చేయట్లేదని , మరోపక్క హాస్పిటల్స్‌లో డబ్బులు విపరీతంగా దోచే కార్యక్రమం చేస్తున్నారని పలువురు చెబుతున్నారని, ఇవన్నీ కూడా గమనించి, ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు భరత్ తెలిపారు. అందుకే రాజమండ్రి పార్లమెంట్ పరిధిలోని ప్రజలంతా విచ్చేసి ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మీడియా వాళ్ళు కూడా కుటుంబ సమేతంగా వచ్చి ఉచిత వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల బీసీ జెఎసి చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, డా గూడూరి శ్రీనివాసరావు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసంశెట్టి గంగాధరరావు, పోలు విజయలక్ష్మి, మజ్జి అప్పారావు, దాసి వెంకటరావు, వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభకు

# పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకావాలి

**- చొప్పరి జయశ్రీ**

**కరీంనగర్ ప్రతినిధి** కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ మాట్లాడుతూ మే 10.న సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్ లో జరుగుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు రావాలని, వచ్చి జయప్రదం చేయగలరని కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ వేదికపై భారతదేశ గౌరవాన్ని మరింత ముందుకు తీసుకెళుతున్నటువంటి నాయకులు మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ. ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా ముందుకు వెళుతున్నటువంటి పార్టీ భారతీయ జనతా పార్టీ అని ఆమె అన్నారు. మే 10 న.సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో జరుగుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలందరూ విచ్చేసి జయప్రదం చేయగలరని చొప్పరి జయశ్రీ ప్రజలను కోరారు.

### వివిధ ఫెడరేషన్ చైర్మన్‌లకు

# నియామక పత్రాలు అందజేత



**హైదరాబాద్** నూతనంగా నియమితులైన వివిధ కుల ఫెడరేషన్ల ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లకు నియామక పత్రాలని టీపీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్ గాంధీ భవన్ లో అందజేసారు. మహేష్ కుమార్ మాట్లాడుతూ సామాజిక సమానత్వం, అన్ని వర్గాల సాధికారత కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తోంది. ప్రతి వర్గానికి సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయడమే మా లక్ష్యం. నూతన బాధ్యతలు స్వీకరించిన అందరికీ హృదయపూర్వక అభినందనలని అన్నారు.

# కారు ఢీకొని చిన్నారి మృతి

**నిజామాబాద్** కారు ఢీకొని చిన్నారి మృతి చెందింది. నిజామాబాద్ రూరల్ చక్రధర్నగర్ తండా కు చెందిన కీర్తన (6) రోడ్డు దాటుతుండగా అతివేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొట్టింది. చికిత్స పొందుతూ కీర్తన మృతి చెందింది. డెంటల్ కాలేజీ విద్యార్థి కారు నడిపినట్లు పోలీసులు గుర్తించారుఏ. కీర్తన తండ్రి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన కారును సీజ్ చేసిన పోలీసులు, కేసు నమోదు చేసారు.

### సూర్యప్రభ వాహనంపై తేజోవంతంగా

# శ్రీ వేదనారాయణ స్వామి

**తిరుపతి, 2026** నాగలాపురం శ్రీ వేదనారాయణ స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజైన గురువారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన వాహనసేవ ఆలయ నాలుగు మాడ వీధుల్లో అత్యంత వైభవంగా సాగింది. గోవింద నామస్మరణల మధ్య భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారి అనుగ్రహం పొందారు. సకల లోకాలకు తేజస్సును ప్రసాదించే సూర్యభగవానుని ప్రతీకగా సూర్యప్రభ వాహనంపై స్వామివారు దర్శనమివ్వడం భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. సకల జీవరాశులకు ప్రాణాధారమైన సూర్యుని మహిమను ప్రతిబింబించేలా ఈ వాహనసేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేదనారాయణస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకాలు నిర్వహించగా భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

# అన్ లోడింగ్ త్వరితగతిన పూర్తి చేయాలి

**- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**

**- ఇల్లంతకుంట మండలంలోని కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల్లో తనిఖీ**



**రాజన్న సిరిసిల్ల** కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే దాన్యాన్ని రైస్ మిల్లర్లు వెంట వెంటనే అన్ లోడింగ్ చేయించాలని కలెక్టర్ అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. మండలంలోని పెద్దలింగాపూర్, అనంతారంలోని కొనుగోలు కేంద్రాల్లో అదనపు కలెక్టర్ గురువారం పరిశీలించారు. ధాన్యం రాశులు, కొనుగోలు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు× హమాలీల సంఖ్యను పెంచాలిరైస్ మిల్లర్లు తమ మిల్లులో హమాలీల సంఖ్యను పెంచి కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే దాన్యం లారీలను అన్ లోడింగ్ చేయించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఇల్లంతకుంట మండలం చింతలకుంటపల్లి లోని లక్ష్మీ సాయి రైస్ మిల్లు, తాళ్ళపల్లి లోని రాజ రాజేశ్వర రైస్ ఇండస్ట్రీస్ లో అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ లోడింగ్, హమాలీల సంఖ్య పెంపు తదితర అంశాలపై మిల్లర్లకు పలు సూచనలు చేశారు అదనపు కలెక్టర్ వెంట మండల తహసీల్దార్ రాచకుంట్ల సురేష్ , ఇల్లంతకుంట సర్పంచ్ మామిడి రాజు , ఏపీఎం కుమారస్వామి తో పాటు తదితరులు పాల్గొన్నారు

# 'పెద్ది' మూవీ ఫైనల్ ఎడిట్ లాక్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ రూరల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'పెద్ది'తో వెండితెరపై సంచలనం సృష్టించడానికి సిద్ధమవుతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత దర్శకుడు బుచ్చి బాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఒకటైన 'పెద్ది' ఫైనల్ ఎడిట్‌ను మేకర్స్ లాక్ చేశారు. దీంతో ఈ సినిమాకు సంబంధించిన ఫైనల్ కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. షార్ప్, ఎమోషనల్ డెప్త్ తీసుకురావడంలో పేరుపొందిన జాతీయ అవార్డు గ్రహీత, ఎడిటర్ నవీన్ నూలి ఈ చిత్రానికి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. బుచ్చి బాబు సానా గ్రేట్ విజన్ తో 'పెద్ది' ఎమోషన్, యాక్షన్, గ్రాండియర్ తో నిండిన ఒక భారీ సినిమాటిక్ అనుభూతిని అందించబోతుంది. ఈ సినిమా కోసం రామ్ చరణ్ కంప్లీట్ గా ట్రాన్స్ ఫర్మేషన్ అయ్యారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో ఆయన మేకోవర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. టెక్నికల్‌గా 'పెద్ది' అత్యున్నత స్థాయిలో తెరకెక్కుతోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, ఆర్ రత్నవేలు సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటింగ్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. రూరల్ స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్, భారీ యాక్షన్ ఎపిసోడ్స్, బలమైన భావోద్వేగాలతో రూపొందుతున్న 'పెద్ది' పాన్ ఇండియా స్థాయిలో పలు దక్షిణ భారత భాషలతో పాటు హిందీలో విడుదల కానుంది. అభిమానుల్లో ఉత్సాహాన్ని మరింత పెంచుతూ జూన్ 3 నుంచే ప్రపంచవ్యాప్తంగా భారీ ప్రీమియర్ షోలు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. దీంతో 'పెద్ది' ఓ హిస్టారిక్ ఓపెనింగ్‌కి సిద్ధమవుతోంది. తారాగణం: మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్, శివ రాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ

## లీలావతి ఆద్యంతం నవ్విస్తుంది



'ప్రస్తుతం నేను సినిమాల్ని ఒప్పుకోవడం లేదు. ఫ్యామిలీకే టైం కేటాయిస్తున్నా. నా బాబుతోనే సమయం గడచిపోతున్నది.. అందుకే సినిమాలకు కాస్త విరామం తీసుకుంటాను' అని చెప్పింది కథానాయిక లావణ్య త్రిపాఠి. ఆమె ప్రధాన పాత్రలో నటించిన వినోదాత్మక చిత్రం 'సతీ లీలావతి' ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకురానుంది. తాతినేని సత్య దర్శకుడు. ఈ సందర్భంగా బుధవారం లావణ్య త్రిపాఠి విలేకరులతో ముచ్చటించింది. ఈ సినిమా షూటింగ్ టైంలోనే తాను ప్రెగ్నెట్ అయ్యానని, టీమ్ అందరి సహకారంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా షూటింగ్ పూర్తిచేశానని చెప్పింది. 'ఈ సినిమాలో నేను డైరెక్టర్ పాత్రలో కనిపిస్తాను. ఈ కథలో వినోదంతో పాటు చక్కటి సందేశం ఉంటుంది. హృదయానికి హత్తుకునే ఎమోషనల్ సన్నివేశాలు కూడా ఉంటాయి' అని లావణ్య త్రిపాఠి తెలిపింది. రామ్‌చరణ్ ఎప్పుడూ సపోర్టివ్‌గా ఉంటారని, ఈ సినిమా ట్రైలర్‌ను ఆయన రిలీజ్ చేయడం సంతోషంగా అనిపించిందని ఆమె తెలిపింది. దవరుణ్‌తేజ్ రూపంలో తనకు అర్థం చేసుకునే భర్త దొరికాడని, ప్రస్తుతం తాము బాబుతో కలిసి హ్యాపీగా ఉన్నామని లావణ్య త్రిపాఠి చెప్పింది. 'వరుణ్‌తేజ్‌తో కలిసి నటించాలనుంది. మేం రియల్‌లైఫ్‌లో కలిసే ఉన్నాం. కాబట్టి తెరపై మా జంట కొత్తగా కనిపించాలంటే కథ విభిన్నంగా ఉండాలి. అలాంటి వైవిధ్యమైన కథ దొరికితే భవిష్యత్తులో తప్పకుండా కలిసి నటిస్తాం' అని లావణ్య త్రిపాఠి పేర్కొన్నది.

# అవతార్ కష్టాలు: చిక్కుల్లో జేమ్స్ కామెరాన్

### – అది తన ముఖమే అంటున్న నటి



ప్రపంచవ్యాప్తంగా సినీ చరిత్రలో రికార్డులు సృష్టించిన 'అవతార్' సిరీస్ ఇప్పుడు ఓ భారీ వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమాలోని కీలకమైన హీరోయిన్ 'నేయ్‌తిరి' పాత్రను తన ముఖం ఆధారంగా, ఎలాంటి అనుమతి లేకుండా సృష్టించారని ఆరోపిస్తూ స్థానిక తెగకు చెందిన నటి క్వోరియన్కా కిల్చర్ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ప్రముఖ దర్శకుడు జేమ్స్ కామెరాన్, వాల్ట్ డిస్నీ కంపెనీలను ప్రతివాదులుగా చేర్చారు. క్వోరియన్కా కిల్చర్ 2005లో 'ది న్యూ వరల్డ్' అనే చిత్రంలో నటించారు. అప్పుడు ఆమె వయసు కేవలం 14 సంవత్సరాలు. ఆ సమయంలో ఎల్ఏ టైమ్స్‌లో ప్రచురితమైన ఆమె ఫోటోను జేమ్స్ కామెరాన్ తన డిజైన్ బృందానికి ఇచ్చి, 'నేయ్‌తిరి' పాత్ర ముఖ కవళికలను రూపొందించమని చెప్పారని దావాలో ఆరోపించారు. తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, అనుమతి తీసుకోకుండా, కనీసం గుర్తింపు గానీ, నష్టపరిహారం గానీ చెల్లించకుండా తన బయోమెట్రిక్ గుర్తింపును వాడుకున్నారని ఆమె పేర్కొన్నారు. ఆసక్తికరంగా, ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తూ స్వయంగా కామెరాన్ గతంలో చేసిన వ్యాఖ్యలే ఇప్పుడు కీలకంగా మారాయి. అవతార్ విడుదల తర్వాత ఓ కార్యక్రమంలో కిల్చర్‌ను కలిసిన కామెరాన్, నేయ్‌తిరి పాత్రకు ఆమె అందమే స్ఫూర్తి అని చెబుతూ ఒక స్కెచ్‌పై సంతకం చేసి ఇచ్చారు. అంతేకాకుండా, ఓ ఇంటర్వ్యూలో కూడా "నేయ్‌తిరి పాత్రకు అసలు మూలం ఎల్ఏ టైమ్స్‌లోని క్వోరియన్కా కిల్చర్ ఫోటోనే. ఆమె ముఖంలోని కింది భాగం చాలా ఆసక్తికరంగా ఉంటుంది" అని కామెరాన్ చెప్పిన వీడియో గతేడాది వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. స్థానిక ప్రజల హక్కుల గురించి మాట్లాడినట్లు కనిపించే అవతార్ సినిమా, వాస్తవానికి ఓ స్థానిక అమ్మాయి గుర్తింపును ఆమెకు తెలియకుండా వాడుకుందని దావాలో ఆరోపించారు. ఈ నేపథ్యంలో తనకు నష్టపరిహారంతో పాటు, సినిమా లాభాల్లో వాటా ఇవ్వాలని, బహిరంగంగా ఈ తప్పును సరిదిద్దాలని కిల్చర్ డిమాండ్ చేస్తున్నారు. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో విచారణ దశలో ఉంది.

# 'సిటాడెల్ 2' సిరీస్ రివ్యూ!



ప్రియాంక చోప్రా .. రిచర్డ్ మాడెన్ ప్రధానమైన పాత్రలను పోషించిన 'సిటాడెల్' సిరీస్ లో, సీజన్ 1కి విశేషమైన ఆదరణ లభించింది. స్పై థ్రిల్లర్ జోనర్లో రూపొందిన ఈ సిరీస్, యాక్షన్ సీక్వెన్స్ వైపు నుంచి మంచి మార్కులు కొట్టేసింది. అలాంటి ఈ సిరీస్ నుంచి సీజన్ 2 ఎప్పుడు వస్తుందా అని అంతా ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 6వ తేదీ నుంచి సీజన్ 2 స్ట్రీమింగ్ కి వచ్చింది. 7 ఎపిసోడ్స్ గా రూపొందిన ఈ సిరీస్, ఇంగ్లిష్ తో పాటు వివిధ భాషల్లో అందుబాటులో ఉంది. ప్రపంచంలోని అత్యంత సంపన్నులచే 'మాంటికోర్' అనే ఒక వ్యవస్థ కొనసాగుతూ ఉంటుంది. హత్యలు చేయించడం మొదలు .. ప్రభుత్వాలను మార్చేయగల ఉన్మాదుల వ్యవస్థగా అది కొనసాగుతూ ఉంటుంది. 'మాంటికోర్'కి అడ్డుకట్ట వేయడానికి 'సిటాడెల్' అనే ఒక గూఢచారి వ్యవస్థ రంగంలోకి దిగుతుంది. ఆ గూఢచారి విభాగంలో నాడియా (ప్రియాంక చోప్రా) మేసన్ కేన్ (రిచర్డ్ మాడెన్) బెర్నార్డ్ పనిచేస్తూ ఉంటారు. కానీ ఆ ఏజెంట్లు అందరూ ఇప్పుడు చెల్లాచెదురై ఉంటారు. అందుకు కారణం మేసన్ కేన్ తల్లి దాలియా. దాలియా 'మాంటికోర్'లో పనిచేస్తుందని తెలియని మేసన్, తమ గూఢచారి సంస్థకి సంబంధించిన ఏజెంట్ల జాబితాను ఆమెకి ఇస్తాడు. అలా చాలా మంది ఏజెంట్లు చనిపోవడానికి అతను కారకుడవుతాడు. ఆ ప్రమాదకర పరిస్థితి తరువాత, మేసన్ .. నాడియా .. బెర్నార్డ్ తలో దిక్కు అవుతారు. 'ఆబీ'ని పెళ్లి చేసుకున్న మేసన్, ఆమెతో ఆనందకరమైన జీవితాన్ని గడుపుతూ ఉంటాడు. నాడియా తన కూతురు 'ఆషా'తో కలిసి జీవిస్తూ ఉంటుంది. ఇక బెర్నార్డ్ మాత్రం 'పౌలో బ్రాగా' స్థావరంలో బందీగా ఉంటాడు. బెర్నార్డ్ తో పౌలో మైండ్ కంట్రోల్ ప్రోగ్రామ్ ను తయారు చేయిస్తూ ఉంటాడు. ఒక వ్యక్తి మెదడులో మైక్రో చిప్ ను అమర్చి, తన ఆదేశాలను ఆ వ్యక్తి పాటించేలా చేయడమే ఆ ప్రోగ్రామ్ ఉద్దేశం. అలా తయారు చేసిన వ్యక్తితో ఒక దేశ అధ్యక్షుడిని చంపించాలనే ఆలోచనలో పౌలో ఉంటాడు. అలాంటి పరిస్థితులలో అక్కడి నుంచి బెర్నార్డ్ తప్పించుకుంటాడు. అలా తప్పించుకున్న బెర్నార్డ్, మాజీ సీఐఏ ఆఫీసర్ 'హచ్ జిమ్' ఆశ్రయాన్ని పొందుతాడు. హచ్ కూడా పౌలో పై ప్రతీకారం తీర్చుకునే ఉద్దేశంతో ఉంటాడు. అతని సాయంతో తన మిగతా టీమ్ సభ్యులను కలుసుకునే దిశగా బెర్నార్డ్ ముందుకు వెళతాడు. తన టీమ్ ను చేరుకున్న నాడియా ఏం చేస్తుంది? తన తల్లి చేసిన ద్రోహానికి ప్రతిగా మేసన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడు? మాంటికోర్ నుంచి మానవాళిని కాపాడటం కోసం వాళ్లు ఏం చేస్తారు? అనేది కథ. మెదడులో అమర్చబడిన మైక్రో చిప్ కారణంగా, తన ఆదేశాలను పాటిస్తూ మానవాళిపై విరుచుకుపడే హంతకులను తయారు చేయించడానికి పౌలో రంగంలోకి దిగడంతో ఈ సిరీస్ మొదలవుతుంది. గతంలో చెల్లాచెదురైపోయిన 'సిటాడెల్' ఏజెంట్లు, నిదానంగా కోలుకుని తిరిగి ట్రాక్ లో పడుతూ ఉండటంతో ఈ కథ జోరందుకుంటుంది. 'సిటాడెల్' టీమ్ అంతా ఒక దగ్గరికి చేరుకున్న దగ్గర నుంచి ఉత్కంఠభరితంగా మారుతుంది. 'సిటాడెల్'కి సంబంధించిన ఏజెంట్లకి ఎదురయ్యే ప్రమాదకరమైన సంఘటనలు, వాటి బారి నుంచి వాళ్లు బయటపడే తీరు ఆడియన్స్ లో ఆసక్తిని రేకెత్తిస్తూ ఉంటుంది. తమ ఆపరేషన్ కి అవసరమైన 'ఎడిసన్' ను పట్టుకోవడానికి సిటాడెల్ ఏజెంట్లు ప్లాన్ చేసిన తీరు బాగుంది. అయితే మొదటి మూడు ఎపిసోడ్స్ తరువాత కథ కాస్త నిదానంగా నడుస్తూ వెళుతుంది. మేసన్ .. అతని తల్లికి సంబంధించిన సన్నివేశాలను, సంభాషణలతో సాగదీసిన భావన కలుగుతుంది. 'సిటాడెల్' మొదటి సీజన్ .. భారీతనమే ప్రధానమైన ఆకర్షణగా నిలిచింది. అందుకు ఎంత మాత్రం తగ్గని నిర్మాణ విలువలతో ఈ సిరీస్ ఆకట్టుకుంటుంది. కథా పరంగా ట్విస్టులు ఉన్నప్పటికీ, అవి కొత్తగా ఏమీ అనిపించవు. యాక్షన్ సినిమాలను ఇష్టపడేవారిని అలరించే రీతిలోనే యాక్షన్ సీక్వెన్స్ ఆకట్టుకుంటాయి. కథలో ఎమోషన్స్ కి పెద్దగా ఛాన్స్ ఇవ్వలేదు .. ఉన్న కొద్ది ఎమోషన్ కనెక్ట్ కాలేదు. పౌలో పాత్రను ఒక రేంజ్ లో పరిచయం చేశారు. తనదైన ప్రత్యేకమైన నేర సామ్రాజ్యాన్ని స్థాపించిన పౌలో, దేశ అధ్యక్షులను టార్గెట్ చేసే స్థాయిలో చక్రం తిప్పుతుంటాడు. అయితే ఆ తరువాత చోటుచేసుకునే సన్నివేశాలు ఆ పాత్ర స్థాయిని తగ్గించినట్టుగా అనిపిస్తుంది. అతను బంధించబడిన దగ్గర నుంచే కథ కాస్త నీరసించినట్టు కనిపిస్తుంది. నటీనటుల నటన మెప్పిస్తుంది. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ పనితీరు బలంగానే కనిపిస్తుంది. ఇది స్పై థ్రిల్లర్ కావడం వలన, అందుకు తగినట్టుగానే ఛేజింగులు .. యాక్షన్ సీన్స్ ఆకట్టుకుంటాయి. కథ రొటీన్ గా అనిపిస్తుంది. కథనం నిదానంగా సాగుతుంది. అభ్యంతరకరమైన సన్నివేశాలు .. సంభాషణలు ఉన్నాయి. అందువలన నలుగురితో కలిసి చూడటం కాస్త ఇబ్బందినే కలిగిస్తుంది.

## జర్నలిస్టుల నిజాయితీనే 'ఆపరేషన్ అరుణారెడ్డి'

### ప్రెస్ మీట్‌లో పోసాని కృష్ణమురళి



ప్రముఖ రచయిత, నటుడు మరియు దర్శకుడు పోసాని కృష్ణమురళి ప్రధాన పాత్రలో నటిస్తూ, దర్శకత్వ బాధ్యతలు చేపట్టిన తాజా చిత్రం "ఆపరేషన్ అరుణారెడ్డి". ఈ సినిమాకు సంబంధించి హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన చిత్ర విశేషాలను పంచుకున్నారు. సమాజంలో జర్నలిస్టులు నిజాయితీగా వ్యవహరిస్తే వ్యవస్థ ఎంతటి సానుకూల మార్పులకు లోనవుతుందనే ప్రధాన ఇతివృత్తంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ఆయన వెల్లడించారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, మాటలు, పాటలు, ఎడిటింగ్‌తో పాటు నిర్మాణ బాధ్యతలను కూడా పోసాని స్వయంగా వహించడం విశేషం. ఈ సందర్భంగా పోసాని కృష్ణమురళి మాట్లాడుతూ, ఈ సినిమా కేవలం ఒక వర్గానికో లేదా రాజకీయ పార్టీకో సంబంధించింది కాదని స్పష్టం చేశారు. ఇందులో అరుణారెడ్డి అనే పవర్ ఫుల్ జర్నలిస్ట్ పాత్రలో హిందోళ చక్రవర్తి నటించారని, రాజకీయాల్లో ప్రజా సేవ కోసం వచ్చేవారు ఎవరు, స్వార్థ ప్రయోజనాల కోసం వచ్చేవారు ఎవరు అనే అంశాలను ఆమె పాత్ర ద్వారా ప్రజలకు వివరించడం జరిగిందని పేర్కొన్నారు. ఒక నిజాయితీ గల జర్నలిస్టుకు రాజకీయ కుట్రల వల్ల ఆపద కలిగినప్పుడు, ఒక ఆదర్శవంతమైన ముఖ్యమంత్రి ఆమెకు ఎలా అండగా నిలిచారు అనే అంశం కథలో కీలకంగా ఉంటుందని చెప్పారు. ఈ ముఖ్యమంత్రి పాత్రలో బీజేపీ నేత, ఎంపీ రఘునందన్ రావు నటించారని, ఆయన నటన సినిమాకు అదనపు బలాన్ని ఇస్తుందని తెలిపారు. తన సుదీర్ఘ సినీ కెరీర్‌లో వందకు పైగా చిత్రాలకు పనిచేసిన అనుభవంతో, ఈ సినిమాకు దేశంలోనే వన్ ఆఫ్ ది బెస్ట్ స్క్రీన్ ప్లే అందించానని పోసాని ధీమా వ్యక్తం చేశారు. సినిమా ఆరంభం నుండి ముగింపు వరకు ప్రేక్షకులు ఊహించని మలుపులతో సాగుతుందని, ఎక్కడా అశ్లీలత గానీ, బూతు మాటలు గానీ లేకుండా కుటుంబమంతా కలిసి చూసేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దానని చెప్పారు. రాజకీయ నాయకుల పట్ల తనకు వ్యక్తిగత ఇష్టాయిష్టాలు ఉన్నప్పటికీ, ఏ పార్టీలోనూ తనకు సభ్యత్వం లేదని, కేవలం ప్రజలకు మేలు చేస్తారని నమ్మిన వ్యక్తులకు మాత్రమే తాను మద్దతు తెలుపుతూ వచ్చానని ఆయన ఈ సందర్భంగా వివరించారు.
చిత్ర కథానాయిక హిందోళ చక్రవర్తి మాట్లాడుతూ, పోసాని వంటి సీనియర్ టెక్నీషియన్ వద్ద పనిచేయడం వల్ల నటనతో పాటు క్రమశిక్షణను కూడా నేర్చుకున్నానని తెలిపారు. అరుణారెడ్డి పాత్ర భావోద్వేగాలతో కూడిన అత్యంత శక్తివంతమైన పాత్ర అని, నేటి సమాజానికి ఇలాంటి పాత్రలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. 3 ఇడియట్స్ మూవీస్ సమర్పణలో, యుపి సినిమా లైన్స్ మరియు కుసుమ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్లపై రూపొందుతున్న ఈ చిత్రంలో కాజల్ శర్మ, ఆయేషా ఖాన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సుధాకర్ ఛాయాగ్రహణం అందించగా, మహదేవ్ ఏలేందర్ సంగీతాన్ని సమకూర్చారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందిన ఈ చిత్రం త్వరలోనే విడుదలకు సిద్ధమవుతోంది.

# నితిన్ కొత్త సినిమా షురూ



గత కొంతకాలంగా కెరీర్‌లో మంచి హిట్ కోసం ఎదురుచూస్తున్నారు హీరో నితిన్. ఈ నేపథ్యంలో ఆయన తాజా చిత్రం బుధవారం లాంఛనంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి నారి సిరిసవాడ, సోమశేఖర్ టి సంయుక్త దర్శకత్వం వహిస్తున్నారు. రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్నది. విభిన్న కథాంశంతో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని, ఈ నెల రెండోవారం నుంచి చిత్రీకరణ మొదలుపెడతామని మేకర్స్ తెలిపారు. ఈ సినిమాకు సంబంధించిన ఇతర నటీనటుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి కెమెరా: అనిత్ మదాడి, సంగీతం: సురేష్ బొబ్బిలి, ఆర్ట్: జానీషేక్, నిర్మాణ సంస్థ: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com